ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

రాజన్న సిరిసిల్ల

జిల్లా వార్తలు

5★★★

శుక్రవారం 21 నవంబరు 2025



సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలి : డీఎంహెచ్‌వో

సిరిసిల్ల టౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఆసుపత్రుల్లో సాధారణ ప్రసవాలను వైద్యులు ప్రోత్సహించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ రజిత అన్నారు. గురువారం స్థానిక వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో డీఎంహెచ్‌వో అధ్యక్షతన జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులతో సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ రజిత మాట్లాడారు. కేంద్ర ఆరోగ్య పథకాల లక్ష్యాలు సాధించాలని అన్నారు. అనంతరం పలు అంశాలపై వైద్యాధికారులకు దిశా నిర్దేశనం చేశారు. కార్యక్రమంలో పీవోఎంహెచ్‌వో డాక్టర్ అంజలి, వైద్యులు సంపత్‌కుమార్, రామకృష్ణ, అనిత, నహీమా పాల్గొన్నారు.

దళారులకు అడ్డుకట్ట వేసేందుకే కొనుగోలు కేంద్రాలు

- అదనపు కలెక్టర్ గడ్డం నగేష్



అచ్చన్నపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

వేములవాడ రూరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : దళారులకు అడ్డుకట్ట వేసేందుకు, రైతులకు మద్దతు ధర కల్పించేందుకే ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామని అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ అన్నారు. మండలంలోని నమిలిగుండుపల్లి, అచ్చన్నపల్లి, వెంకటాంపల్లి గ్రామాలలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను గురువారం ఆయన పరిశీలించారు. కొనుగోలు కేంద్రాలలో రైతుల కోసం కల్పించాల్సిన వసతులపై అధికారలకు పలు సూచనలు చేశారు. అనంతరం జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు వినియోగించుకోవాలన్నారు. దళారులను నమ్మి మోసపోవద్దన్నారు. రైతులు తమ ధాన్యాన్ని తాలు, తప్ప లేకుండా ఉండేలా చూసుకోవాలన్నారు. ప్రభుత్వం గ్రేడ్ ఏ రకం క్వింటాలు ధాన్యానికి రూ.2389, సాధారణ ధాన్యం క్వింటాలుకు రూ.2369గా నిర్ణయించిందన్నారు. ఆయన వెంట పలువురు అధికారులు ఉన్నారు.

కొనుగోలు కేంద్రాల పరిశీలన..

చందుర్తి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): రైతులకు ప్రభుత్వం మద్దతు ధర అందించేందుకే కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిందని అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ అన్నారు. చందుర్తి మండలం మూడపల్లి,ఆశిరెడ్డిపల్లి, రామన్నపేట, చందుర్తి, మల్యాల, నర్సింగాపూర్, కిష్టంపేట్, జోగాపూర్, తిమ్మాపూర్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ గురువారం పరిశీలించారు. కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని రైతులను కోరారు. ఆయన వెంట ఆర్ఐలు శ్రీనివాస్, మహేందర్ ఉన్నారు.

లింగ నిర్ధారణలతో బాలికల నిష్పత్తి తగ్గిపోతోంది..

- జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీనారాయణ



మాట్లాడుతున్న జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీనారాయణ

సిరిసిల్ల టౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : లింగ నిర్ధారణలతో బాలికల నిష్పత్తి తగ్గిపోతోందని జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీనారాయణ అన్నారు. గురువారం సీడీపీవో సిరిసిల్ల పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలలో, విద్యాలయాలలో బాలల హక్కుల వారోత్సవాలలో జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీనారాయణ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముందుగా అంగన్‌వాడీ కేంద్రాలలో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అందిస్తున్న ఆహార పదార్థాల నాణ్యతను జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీనారాయణ పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ లింగ నిర్ధారణ, గర్భవిచ్ఛితికి పాల్పడడం వల్ల బాలికల నిష్పత్తి తగ్గిపోతోందన్నారు. ఇది చాలా దుష్పరిణామానికి దారితీస్తుందని, భవిష్యత్తులో సమాజంపై అనర్థాలకు దారి తీస్తుందన్నారు. అనంతరం విద్యా హక్కు, ఆహార భద్రత, గర్భిణులు తీసుకొనే ఆహారంపై అవగాహన కల్పించారు. అనంతరం రంగినేని ట్రస్టులో అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా వయోవృద్ధులతో సమావేశం అయ్యారు. ఖాతాలు ఉన్న బ్యాంకులు దూరంగా ఉండడం వల్ల ఇబ్బందులు వస్తున్నాయని వృద్ధులు తెలపడంతో స్పందించిన జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీనారాయణ ఎస్‌బీఐ అధికారులతో మాట్లాడి ఎస్‌బీఐలో ఖాతాలు ఇవ్వాలని కోరారు. వృద్ధుల సమస్యలను ఆరా తీశారు. అనంతరం తంగళ్లపల్లి ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ కళాశాలలో బేటీ బచావ్, బేటి పడావో కార్యమంలో పాల్గొన్నారు. విద్యార్థులకు బాల్య వివాహాల వలన కలిగే దుష్పరిణామాలను వివరించారు.

ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ దివ్య, డీసీపీవో కవిత, డీహబ్ కో ఆర్డినేటర్ రోజా, ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ప్రిన్సిపల్ జి జయ, ప్రభుత్వ వృద్ధుల ఆశ్రమం కోఆర్డినేటర్ మమత పాల్గొన్నారు.

ధర్మమే విజయం సాధించింది

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు గోపి

సిరిసిల్ల టౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : బండి సంజయ్‌పై గత ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసులలో ధర్మమే విజయం సాధించిందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి అన్నారు. కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్‌పై 10వ తరగతి పరీక్ష పేపర్ లీకేజీ చేశాడని గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం కేసులు పెట్టగా గురువారం హైకోర్టు పూర్తి నిరాధారమైన కేసుగా భావించి కొట్టివేయడంతో జిల్లా కేంద్రం అంబేద్కర్ చౌరస్తా వద్ద బీజేపీ ఆధ్వర్యంలో సంబరాలు జరుపుకున్నారు. ముందుగా బీజేపీ శ్రేణులు టపాసులు కాల్చి స్వీట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గోపి మాట్లాడారు. షాడో సీఎంగా వ్యవహరించిన కేటీఆర్ ప్రభుత్వంలో పదో తరగతి విద్యార్థుల పరీక్ష పేపర్ లీకేజీ చేశాడని బండి సంజయ్‌పై ఎలాంటి ఆధారాలు లేకుండా కేసు పెట్టారని ఆరోపించారు. బండి సంజయ్‌ని కట్టడి చేయడం కోసం దొంగ కేసును మోపారని గురువారం దొంగ కేసుగా అభివర్ణిస్తూ హైకోర్టు కొట్టి వేయడంతో న్యాయం, ధర్మం గెలిచిందని, ఇది కేటీఆర్‌కు చెంపపెట్టని అన్నారు. బీజేపీ నాయకులను, కార్యకర్తలను భయభ్రాంతులకు గురిచేయడం కోసం ఆరోజు బీఆర్‌ఎస్ ప్రభుత్వం బండి సంజయ్‌ను అక్రమంగా అరెస్టు చేయించారని ఆరోపించారు. ఎల్లారెడ్డిపేటలో పెట్టిన అక్రమ కేసులను ఏదోరోజు కోర్టులు కొట్టివేస్తాయని అన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికార దుర్వినియోగం చేస్తూ బీజేపీ నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టారని ఆరోపించారు. రెండు సంవత్సరాలుగా సిరిసిల్ల ఎమ్మెల్యేగా కేటీఆర్ నియోజకవర్గంలో రైతుల కష్టాలను పట్టించుకోకుండా జూబ్లిహిల్స్‌లో ఉప ఎన్నికలలో బీఆర్‌ఎస్ పార్టీ విజయం కోసం తిరిగి ఓడిన కేటీఆర్ సిగ్గుతో తలదించుకోవాలని ఆరోపించారు. రానున్న రోజుల్లో కేటీఆర్‌కు బీజేపీ ప్రతాపం ఏంటో చూపిస్తామని రెడ్డబోయిన గోపి అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు దుమాల శ్రీకాంత్, పట్టణ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పల్లె ఓటరు జాబితాకు కసరత్తు



- జిల్లాలో మొదలైన జాబితాల సవరణ ప్రక్రియ
- నేడు అభ్యంతరాల పరిష్కారం..
- 23న తుది ఓటరు జాబితా, పోలింగ్ కేంద్రాల వెల్లడి
- డిసెంబరులో పంచాయతీ ఎన్నికల నిర్వహణకు సన్నద్ధం
- పల్లెల్లో మొదలైన హడావుడి

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

పంచాయతీ ఎన్నికలకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో పల్లెల్లో హడావుడి మొదలైంది. రాజన్న సిరిసిల్ల జిల్లాలో పంచాయతీ ఎన్నికల సందడికి మరోవైపు అధికార యంత్రాంగం ఏర్పాట్ల వైపు దృష్టి పెట్టింది. డిసెంబరు 1 నుంచి 9 వరకు ప్రజాపాలన వారోత్సవాలు నిర్వహించి సంక్షేమ కార్యక్రమాలను విస్తృతంగా ప్రచారం చేపట్టి అదే ఊపులో స్థానిక ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తోంది.

ఇందులో భాగంగా ముందుగా గ్రామపంచాయతీ ఎన్నికలు నిర్వహించి అదే క్రమంలో పరిషత్, బల్దియా ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయించారు. ఇందు కోసం రాష్ట్ర ఎన్నికల కమిషన్ గ్రామపంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ఓటరు జాబితాను సవరించే పనిలో పడింది. గురువారం జిల్లాలో పంచాయతీరాజ్ సిబ్బంది జాబితా సవరణ కసరత్తు మొదలుపెట్టింది. 21న దరఖాస్తులు, అభ్యంతరాలు పరిష్కరించి 23వ తేదీన తుది ఓటరు జాబితా, పోలింగ్ కేంద్రాల జాబితాలను గ్రామ పంచాయతీల వారీగా ప్రదర్శించనున్నారు.

జిల్లాలో ఇప్పటికే అధికార యంత్రాంగం స్థానిక ఎన్నికలకు సర్వం సిద్ధం చేయడమే కాకుండా నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైన రోజే బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అంశంపై హైకోర్టు ఎన్నికలకు బ్రేక్ వేసినది తెలిసిందే. ఈసారి పాత రిజర్వేషన్ల ప్రకారమే ముందుగా గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహణకు సిద్ధమయ్యారు. జిల్లాలో ఎన్నికల నిర్వహణకు బ్యాలెట్ బాక్సులు, నోడల్ అధికారుల నియామకం, ఆర్వోలు, పివోలు, ఏపీవోలకు రెండు విడతలుగా శిక్షణ కార్యక్రమాలు చేపట్టారు. సర్పంచ్‌లకు గులాబీ రంగు, వార్డు మెంబర్లకు తెలుపు రంగు బ్యాలెట్ పేపర్లు ముద్రించడానికి సిద్ధం చేశారు. నోటిఫికేషన్ రావడమే తరువాయి జిల్లా యంత్రాంగం ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉంది.

జిల్లాలో గ్రామపంచాయతీ ఓటర్ల వివరాలు..

మండలం	పురుషులు	మహిళలు	మొత్తం
బోయిన్‌పల్లి	14753	1572	30505
చందుర్తి	13445	14649	28094
ఇల్లంతకుంట	19644	20902	40546
గంభీరావుపేట	17811	18996	36807
కోనరావుపేట	17180	18045	35225
ముస్తాబాద్	18658	19842	38500
రుద్రంగి	6454	7208	13665
తంగళ్లపల్లి	19395	20683	40079
వీర్నపల్లి	5769	5958	11727
వేములవాడ	8953	9523	18492
వేములవాడ రూరల్	9020	9805	18825
ఎల్లారెడ్డిపేట	19690	21196	40886
మొత్తం	170772	182559	353351

జిల్లాలో 3.53 లక్షల మంది ఓటర్లు

రాజన్న సిరిసిల్ల జిల్లాలో 260 గ్రామపంచాయతీలు, 2268 వార్డులు ఉన్నాయి. ఇప్పటికే ప్రకటించిన ఓటర్ల జాబితా ప్రకారం జిల్లాలో పంచాయతీలో 3.53 లక్షల మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో పురుషులు 170772 మంది, మహిళలు 182559 మంది ఉన్నారు. ఇందులో పురుషుల కంటే మహిళా ఓటర్లు 11787 మంది అధికంగా ఉన్నారు. పంచాయతీ ఎన్నికల్లో మహిళా ఓట్లే కీలకం కానున్నాయి. పురుషుల కంటే మహిళా ఓటర్లు 11787 మంది అధికంగా ఉన్నారు. జిల్లాలోని ప్రతి మండలంలో మహిళలు ఓట్లు అధికంగా ఉండడంతో స్థానిక ఎన్నికల్లో గెలుపు, ఓటములపై మహిళా ఓటింగ్ ప్రభావం చూపనున్నట్లు భావిస్తున్నారు.

జిల్లా యంత్రాంగం స్థానిక సంస్థల ఎన్నికలకు పోలింగ్ కేంద్రాలు, అవసరమయ్యే బ్యాలెట్ బాక్సులు, ఇతర సామగ్రిని సిద్ధంగా ఉంచారు. జిల్లాలో 260 గ్రామపంచాయతీలు, 2268 వార్డు సభ్యులు ఉండగా 1734 పోలింగ్ కేంద్రాలు సిద్ధం చేశారు. గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి 200 మంది ఓటర్లు ఉన్నవరకు 1734 పోలింగ్ కేంద్రాలు,

మిగతా 8వ పేజీలో..

భీమేశ్వరాలయంలో భద్రత పటిష్టం..

- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్



సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ టౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరస్వామి దేవస్థానం అనుబంధ ఆలయమైన భీమేశ్వరాలయంలో భద్రత పటిష్టంలో భాగంగా గురువారం 32 సీసీ కెమెరాలు, 15 హ్యాండ్, 5 డోర్ మెటల్ డిటెక్టర్‌లు, కెమెరాల ఎల్ఈడీ స్ర్కీన్‌ను గురువారం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు చేపట్టామన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ శేషాద్రినిరెడ్డి, ఈవో రమాదేవి, టౌన్ సీఐ వీరప్రసాద్, ఈఈ రాజేష్, డీఈలు రఘునందన్, మహిపాల్‌రెడ్డి, ఏఈ రాంకిషన్‌రావు, ఆలయ ఏఈవోలు బ్రహ్మన్నగారి శ్రీనివాస్, జయకుమారి, అశోక్‌కుమార్, పర్యవేక్షకులు శ్రీనివాస్‌శర్మ, శ్రీకాంతచార్యులున్నారు.

భీమన్న సన్నిధిలో ప్రభుత్వ విప్ పూజలు

భీమేశ్వరాలయంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పూజలు చేశారు. వేదపండితులు ఆశీర్వచనం ఇవ్వగా, ఇవో రమాదేవి స్వామివారి శేషవస్త్రం, లడ్డూ ప్రసాదం అందజేశారు.

స్థానిక సంస్థల ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహించాలి

- వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాణీకుముదిని - పాల్గొన్న ఇన్‌చార్జి కలెక్టర్, ఎస్పీ

సిరిసిల్ల, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ ఐ రాణీకుముదిని ఆదేశించారు. గురువారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, డీజీపీ శివధర్ రెడ్డి, ఎన్నికల సంఘం అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం నుంచి ఇన్‌చార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గీతే హాజరయ్యారు. గ్రామసర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికల నిర్వహణ, ఓటరు జాబితా అభ్యంతరాలు, పోలింగ్ కేంద్రాలు, శాంతిభద్రతల అంశాలపై సమీక్షించారు. ఈసందర్భంగా ఎన్నికల సంఘం కమిషనర్ మాట్లాడుతూ సర్పంచ్, వార్డుసభ్యుల ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో సమర్థవంతంగా నిర్వహించాలని, ఎన్నికలను నిర్వహించేందుకు అవసరమైన కార్యాచరణ రూపొందించాలని తెలిపారు. ఎన్నికల సమయంలో రాష్ట్రజిల్లా స్థాయిలో ఎన్నికల ప్రవర్తన నియమావళి సమర్థవంతంగా అమలుచేయాలని, ఎన్నికల పరిశీలకులకు శిక్షణ అందిస్తామని అన్నారు. జిల్లా స్థాయిలో ఏర్పాటు చేసే ఎన్నికల నిర్వహణ కమిటీ సభ్యుల జాబితా సమర్పించాలని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డీఆర్‌ఓ శేషాద్రి, జడ్పీ సీఈవో వినోద్ కుమార్, డీపీవో శరీఫొద్దిన్, డిప్యూటీ జడ్పీ సీఈవో గీత తదితరులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఇన్‌చార్జి కలెక్టర్, ఎస్పీ



ఆది శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న సిరిసిల్ల పద్మశాలి సంఘం ప్రతినిధులు

పద్మశాలి సంఘం అభివృద్ధికి తోడ్పాటు : ప్రభుత్వ విప్

వేములవాడ టౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): పద్మశాలి సంఘం అభివృద్ధికి తోడ్పాటునందిస్తానని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. గురువారం రాత్రి వేములవాడ బీమేశ్వర సదన్‌లో ఆది శ్రీనివాస్‌ను నూతన సంగా ఎన్నికైన సిరిసిల్ల పద్మశాలి సంఘం కార్యవర్గం మార్యదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా విప్ మాట్లాడుతూ పద్మ శాలీల అభివృద్ధికి ప్రభుత్వం ఎళ్లవేళలా కృషి చేస్తుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు సంగీతం శ్రీనివాస్, పద్మశాలి సంఘం అధ్యక్షులు దూడం శంకర్, ప్రధాన కార్యదర్శి మండల సత్యం, ఉపాధ్యక్షులు గాజుల బాలయ్య, మోర రవి, క్యాషియర్ యెల్లే శ్రీనివాస్, సహాయ కార్యదర్శి కోడం శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

'చలో ఢిల్లీ' కరపత్రం విడుదల

గంభీరావుపేట, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : గంభీరావుపేట మండలకేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద 'హలో మాల చలో ఢిల్లీ' కరపత్రాలను గురువారం విడుదల చేశారు. ఈనెల 26న ఢిల్లీలో జరిగే ఈ కార్యక్రమానికి పెద్దఎత్తున తరలిరావాలని జాతీయ మాలల ఐక్యవేదిక రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు దోసల చంద్రం పిలుపునిచ్చారు. రాజ్యాంగ హక్కుల సాధనలో భాగంగా దళితుల ఐక్యతను చాటిచెప్పే ఈ సభను జయప్రదం చేయాలన్నారు. మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు ఎడ్ల రాజ్‌కుమార్, మల్యాల రాజవీర్, ఎగదండి స్వామి, రాజు, రఘు, రమేష్, సురేష్, నాగరాజు, బాబు, రామచంద్రం, శంకర్, ప్రవీణ్ కార్తీక్, మహేందర్, రామస్వామి, అర్జున్, నాంపెల్లి తదితరులు ఉన్నారు.

ఆర్థిక వ్యవస్థకు సహకార రంగం తోడ్పాటు

- అర్బన్ బ్యాంక్ చైర్మన్ రాపెల్లి లక్ష్మీనారాయణ



పాఠశాలకు సామగ్రి అందిస్తున్న చైర్మన్, జిల్లా సహకార అధికారి, డైరెక్టర్లు

సిరిసిల్ల, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): దేశ ఆర్థిక వ్యవస్థకు సహకార రంగం తోడ్పాటు అందిస్తోందని సిరిసిల్ల అర్బన్ బ్యాంక్ చైర్మన్ రాపెల్లి లక్ష్మీనారాయణ అన్నారు. గురువారం పట్టణంలోని సిరిసిల్ల సహకార అర్బన్ బ్యాంక్ ప్రధాన కార్యాలయంలో సహకార వారోత్సవాల ముగింపు వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంక్ ద్వారా వివిధ పాఠశాలకు ప్రింటర్లు, ప్యూరిఫైడ్ వాటర్‌ఫిల్టర్లు, ఫ్యాన్లు ఇతర సామగ్రిని ఉచితంగా జిల్లా సహకార అధికారి రామకృష్ణ చేతుల మీదుగా అందజేశారు. వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులుకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ దేశాభివృద్ధిలో సహకార సంఘాలు పోషించిన పాత్ర ఎంతో ప్రాముఖ్యమైనదన్నారు. అన్ని వర్గాల ప్రజలు సహకార రంగాల్లో భాగస్వాములు కావాలని కోరారు. బ్యాంకు డిపాజిట్లు రూ 94.15 కోట్లు ఉన్నాయన్నారు. ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించడానికి మొబైల్ బ్యాంకింగ్ అందుబాటులోకి తీసుకొస్తున్నామని తెలిపారు. జిల్లా శాఖ అధికారి రామకృష్ణ మాట్లాడుతూ సహకార వ్యవస్థపై ప్రజల్లో అవగాహన పెంపొందించడానికి సహకార వారోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. సహకార స్ఫూర్తితో బ్యాంక్ పాలకవర్గం సేవలందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ వైస్ చైర్మన్ అడ్డగట్ల మురళి, సీఈవో పతిపాక శ్రీనివాస్, సహకార శాఖ అధికారి రమాదేవి, డైరెక్టర్లు గుడ్ల సత్యానందం, పాటి కుమార్ రాజు, బుర్ర రాజు, వేముల చుక్కమ్మ, ఎనగందుల శంకర్, కోడం సంజీవ్, కోఆర్డినేటర్ వెంకటేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

పుస్తక జ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలి..

- జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ



విద్యార్థికి బహుమతి అందజేస్తున్న నాగుల సత్యనారాయణ

సిరిసిల్ల టౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరు పుస్తక జ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ అన్నారు. గురువారం స్థానిక గ్రంథాలయం ఆవరణలో జాతీయ గ్రంథాలయాల వారోత్సవం ముగింపు సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నాగుల సత్యనారాయణ మాట్లాడారు. దేశ స్వాతంత్ర్య ఉద్యమం నుంచి ఇప్పటివరకు గ్రంథాలయాలు కీలక పాత్రను పోషిస్తున్నాయన్నారు. గ్రంథాలయాల్లో వేల పుస్తకాలు అభ్యసించిన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ భారత దేశ సామాజిక న్యాయానికి పెద్దపీట వేశారన్నారు. పుస్తకాలు గొప్ప ఆలోచనకు పదును పెట్టి అనేక ఆవిష్కరణలు చేయడానికి తోడ్పడుతాయన్నారు. యువకులు కాలాన్ని వృథా చేయకుండా పుస్తకాలను చదవడం అలవాటు చేసుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం జిల్లా గ్రంథాలయం ఆధ్వర్యంలో నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలైన విద్యార్థులకు మెరిట్ సర్టిఫికెట్లు, బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ ఇన్‌చార్జి కార్యదర్శి బి శంకరయ్య, గ్రంథపాలకుడు కమటం మల్లయ్య, తెలంగాణ రాష్ట్ర రచయితల సంఘం అధ్యక్షుడు జూకంటి జగన్నాథం, కాలమిస్ట్ సంపతి రమేష్, సిరిసిల్ల పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, ఉపాధ్యక్షుడు బొప్ప దేవయ్య, టీపీసీసీ కోఆర్డినేటర్ సంగీతం శ్రీనివాస్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సూర దేవరాజు, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు కామని వనిత, పీసీసీ మాజీ కార్యదర్శి గడ్డం నర్సయ్య. తదితరులు పాల్గొన్నారు.

చెకుముఖి టాలెంట్ టెస్ట్‌ను విజయవంతం చేయాలి

వేములవాడ, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): వేములవాడ కేంద్రంగా 13 మండలాలకు సంబంధించిన చెకుముఖి టాలెంట్ టెస్ట్‌లను విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్షుడు గోపాల్ పిలుపునిచ్చారు. ఈసందర్భంగా వేములవాడ పట్టణంలో జన విజ్ఞాన ఎదిక ఆధ్వర్యంలో పోస్టర్‌ను గురువారం ఆవిష్కరించారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ చెకుముఖి టాలెంట్ టెస్ట్‌లో భాగంగా పర్యావరణ పరిరక్షణ, వేసవి కాలంలో శీతల పానీయాలు వద్దు సహజపానీయాలు ముద్దు అనే కార్యక్రమం, మూఢ నమ్మకాలపై భానుమతి, చేతబడిలాంటి వాటిపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిలివేరి సంపత్ పారం లక్ష్మీనారాయణ, గుర్రం ఆంజనేయులు తదితరులు ఉన్నారు.

సమన్వయంతో పనులు పూర్తి చేయాలి
- గడువులోగా అందుబాటులోకి తీసుకురావాలి
- అభివృద్ధి పనులకు స్థలాలు గుర్తించాలి
- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్
8

మద్యం మత్తులో యువకుడి హంగామా

● ఒంటిపై గాయాలు చేసుకుని వీరంగం



ఒంటిపై గాయాలతో సాయికుమార్

తంగళ్లపల్లి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో ఓ యువకుడు మండల కేంద్రంలో హంగామా సృష్టించాడు. మండేపల్లి మూలమలుపు వద్ద తంగళ్లపల్లికి చెందిన సాయికుమార్ కుటుంబ కలహాలతో మద్యం మత్తులో కత్తితో ఒంటిపై గాయాలు చేసుకుని వీరంగం చేశాడు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని అతడిని ఆసుపత్రికి తరలించారు.

పార్వతీపురం పోలీస్ క్వార్టర్‌లో నాగుపాము కలకలం



నాగుపాము పడుతున్న జగదీష్

వేములవాడ టౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరస్వామి దేవస్థానం వెనుకవైపు ఉన్న పార్వతీపురం పోలీస్‌క్వార్టర్‌లో గురువారం రాత్రి నాగుపాము దూరి కలకలం సృష్టించింది. ఆలయ పార్వతీపురం 13ఏలో ఆలయభద్రతా సిబ్బంది నివాసం ఉంటారు. ఈ పోలీస్‌క్వార్టర్‌లో అయిదు అడుగులనాగుపాము ప్రత్యక్షమైంది. ఇదిచూసిన భద్రతాసిబ్బంది స్నేక్‌క్యాచర్ జగదీష్‌కు సమాచారం అందించారు. అతను వచ్చి పామునుపట్టి దూరంలో వదిలిపెట్టాడు.

కొండచిలువ హతం



గర్రెపల్లిలో కొండ చిలువ

సుల్తానాబాద్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): గర్రెపల్లిచెరువు సమీపంలోని వైకుంఠధామం వద్ద రహదారిపై రైతులకు కొండ చిలువకనిపించింది. ఈదారివెంట వెళ్లా లంటే భయంగా ఉందని రైతులు పేర్కొన్నారు. గర్రెపల్లి మీదుగా గొల్లపెల్లి, సాంబయ్యపల్లి, నారాయణరావుపల్లి గ్రామాలకుచెందిన వారు ఈదారి నుంచి రాకపోకలు సాగిస్తుంటారు. రైతులు కర్రలతో కొట్టడంతో చనిపోయింది.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత

కరీంనగర్ క్రైం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): రామగుండానికి చెందిన ఆకుల శివకుమార్ అనేవ్యక్తి అక్టోబరు 26న తన సెల్‌ఫోన్‌ను ఆరెపల్లి వద్ద పోగొట్టుకుని కరీంనగర్ రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు సీఈఐఆర్ టెక్నాలజీ ద్వారా ఆ సెల్‌ఫోన్ హైదరాబాద్‌లో ఒక వ్యక్తి వద్ద ఉన్నట్లుగా గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. బాధితుడిని గురువారం రూరల్ స్టేషన్‌కు పిలిచి సీఐ ఏ నిరంజన్‌రెడ్డి సెల్‌ఫోన్‌ను అందజేశారు.

పరిశ్రమల అభివృద్ధికి ఉద్యమ్

● బ్యాంకు రుణాలకు రిజిస్ట్రేషన్ తప్పనిసరి



చొప్పదండి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు (ఎంఎస్ఎంఈ) అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం ఉద్యమ్ పోర్టల్‌ను తీసుకువచ్చింది. నిరుద్యోగులు స్వయం ఉపాధి పొందేందుకు, వ్యాపార రంగంలో స్థిరపడేందుకు బ్యాంకులు రుణాలు అందజేస్తుంటాయి. ఉద్యమ్ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ కలిగి ఉంటేనే బ్యాంకులు రుణాలు అందజేస్తున్నాయి. ఈ ఉద్యమ్ రిజిస్ట్రేషన్ సంస్థల అధికారిక గుర్తింపుగా పని చేస్తుంది. తక్కువ వడ్డీ ప్రయోజనాలు కలిగిన ఉన్న వివిధ పథకాలు, గ్యారంటీ లేని రుణాల కోసం ఉద్యమ్ పోర్టల్‌లో తప్పనిసరంగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలి.

ప్రయోజనాలు...

ప్రభుత్వ పథకాల ద్వారా నిరుద్యోగులు, వ్యాపారులు పొందే రుణాల్లో వడ్డీ రాయితీ, గ్యారంటీ లేకుండా రుణం పొందే అవకాశం, తక్కువ వడ్డీకే రుణాల లాంటి ప్రయోజనాలు ఉద్యమ్ రిజిస్ట్రేషన్‌తో కలుగుతాయి. ఎంఎస్ఎంఈ మంత్రిత్వశాఖ ద్వారా అందించే ఉద్యమ్ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ కాగిత రహితంగా పూర్తిగా ఆన్‌లైన్‌లో జరిగే ప్రక్రియ. రిజిస్ట్రేషన్ పూర్తయిన అనంతరం యూఆర్ఎన్ నంబర్‌తో కూడిన ధ్రువీకరణ పత్రం లభిస్తుంది. సంస్థకు ఒక శాశ్వత సంఖ్యతో ప్రత్యేక గుర్తింపు లభిస్తుంది. ఆధార్, పాన్ లింకు కలిగి ఉండి, పట్టణాల్లో అయితే స్ట్రీట్ వెండర్లకు, ముద్ర రుణాల దర ఖాస్తుదారులకు, పరిశ్రమలు, సేవా రంగంలో వ్యాపారం కోసం పీఎంఈజీపీ లాంటి పథకాలలో బ్యాంకు రుణాలు తీసుకునేవారికి ఉద్యమ్ రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా ఉండాలని బ్యాంకు అధికారులు చెప్తున్నారు.

రిజిస్ట్రేషన్ చేసుకోవడం ఇలా...

www.udyamregistration.gov.inఅనే వెబ్‌సైట్‌లో ఫర్ న్యూ ఎంటర్‌ప్రెన్యూర్స్ అనే ఆప్షన్‌ను ఎంచుకోవాలి. దానిలో ఆధార్ జూంబర్, పేరు నమోదు చేసి జనరేట్ చేయగానే ఆధార్ కార్డుకు లింకు ఉన్న మొబైల్‌కు ఓటీపీ వస్తుంది. ఓటీపీ ఎంటర్ చేయగానే పాన్‌కార్డు నంబర్, వివరాలు అడుగుతుంది. పాన్‌కార్డు వివరాలు ఎంటర్ చేయగానే మొబైల్ నెంబర్, మెయిల్ ఐడీ, సామాజిక వర్గం, వ్యాపార సంస్థ పేరు, చిరునామా, సంస్థ రిజిస్ట్రేషన్ వివరాలు, బ్యాంకు వివరాలు, పెట్టుబడి వివరాలు నమోదు చేయాలి. అన్ని వివరాలు సరిచూసుకున్న తర్వాత దరఖాస్తును సబ్‌మిట్ చేయాలి. దరఖాస్తును సమర్పించగానే ఉద్యమ్ రిజిస్ట్రేషన్ నంబర్ (యూఆర్ఎన్) చూపిస్తుంది. నమోదు చేసిన మెయిల్ ఐడీ ఉద్యమ్ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ వస్తుంది. ఈ ఉద్యమ్ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్‌ను కేంద్ర ప్రభుత్వ ఎం ఎస్ఎంఈ మంత్రిత్వశాఖ జారీ చేస్తుంది.

లొంగుబాటలో మావోయిస్టు నేత మల్లా రాజిరెడ్డి?

● మంతనాలు జరుపుతున్న బంధుమిత్రులు

● రెండు రోజుల్లో స్పష్టత వచ్చే అవకాశం..



మల్లా రాజిరెడ్డి(ఫైల్)

మంథని, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టు పార్టీ కేంద్రకమిటీ సభ్యుడు మల్లా రాజిరెడ్డి అలియాస్ సత్తెన్న లొంగుబాటుకు ప్రయత్నాలు ముమ్మరంగా కొనసాగుతున్నట్లు సమాచారం. లొంగుబాటు కోసం మార్గం సుగమమయ్యేందుకు ప్రభుత్వ పెద్దలతో రాజిరెడ్డి బంధు, మిత్రులు సంప్రదింపులు జరుపుతున్నట్లు తెలుస్తోంది. ఆపరేషన్ కగార్‌తో దండకారణ్యంలో చోటు చేసుకుంటున్న ఎన్‌కౌంటర్‌లు, పదులసంఖ్యలో అగ్రనేతలు మృత్యువాత, లొంగిపోయారు. ఈక్రమంలో రాజిరెడ్డి లొంగు బాటు కోసం వారు ప్రయత్నాలు చేస్తున్నారు. మరో రెండురోజుల్లో రాజిరెడ్డి లొంగుబాటుపై స్పష్టత వచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తుంది. మంథని మండలంలోని శాస్త్రులపల్లి గ్రామానికి చెందిన మల్లా రాజిరెడ్డి విప్లవ రాజకీయాలకు ఆకర్శితుడై దాదాపు 45ఏళ్లుగా పని చేస్తూ కేంద్ర కమిటీ సభ్యుడి స్థాయికి ఎదిగారు. కేంద్ర కమిటీ సభ్యుడిగా 2007లో కేరళలోని ఎర్నాకుళంలో పోలీసులు అరెస్టు చేయగా మంథని, మెట్‌పల్లి కోర్టులో హాజరుపర్చి జైలుకు తరలించారు. కేసుల విచారణ అనంతరం బెయిల్ పై విడుదలైన రాజిరెడ్డి తిరిగి అజ్ఞాతంలోకి వెళ్లారు.

ఇన్సూరెన్స్ డబ్బుల కోసం..

● బట్టల షాపునకు నిప్పు పెట్టుకున్న యజమాని ● అగ్నిప్రమాదమంటూ పోలీసులకు ఫిర్యాదు

● కుట్రను ఛేదించి ముగ్గురిని అరెస్టు చేసిన త్రీటౌన్ పోలీసులు

కరీంనగర్ క్రైం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లోని కోర్టు చౌరస్తాలో మహాలక్ష్మి ఫ్యాషన్‌మాల్‌లో ఈనెల 17న ఉదయం జరిగిన అగ్నిప్రమాదం కేసును త్రీటౌన్ పోలీసులు ఛేదించారు. ఇది ప్రమాదవశాత్తు జరిగింది కాదని, ఇన్సూరెన్స్ డబ్బుల కోసం యజమాని ఉద్దేశపూర్వకంగా చేసిన పని అని పోలీసులు గుర్తించారు. కరీంనగర్ త్రీటౌన్‌సీఐ జి జాన్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... మహాలక్ష్మి ఫ్యాషన్‌మాల్ యజమాని సంగం రాజేశ్ వ్యాపారంలో నష్టాలు రావడం, అప్పుల బాధతో ఇన్సూరెన్స్ డబ్బులు క్లెయిమ్‌చేసి బయటపడాలని పథకం వేశాడు. ఇందులో భాగంగా తనవద్ద పనిచేసే రాకేశ్, మధుతో కలిసి కుట్రపన్నాడు. ఘటనకు ముందు షాపులోని విలువైన బట్టలను రహస్యంగా తరలించి, అనంతరం పెట్రోల్ పోసి షాపునకు నిప్పంటించారు. అనంతరం ఏమీ తెలియనట్లు రాజేశ్ డయల్ 100కు ఫోన్‌చేసి ప్రమాదంగా చిత్రీకరించే ప్రయత్నం చేశాడు. అయితే షాపులో ఒక మూలన మాత్రమే బట్టలు కాలిపోయి ఉండటం, సీసీ కెమెరాల డీవీఆర్ కాలిపోవటంతో సంఘటనా స్థలాన్ని పరిశీలించిన సీఐ జాన్‌రెడ్డికి అనుమానం కలిగింది. ఆ షాపులో సీసీ కెమెరాలను పరిశీలించేందుకు అవకాశం లేకుండా డీవీఆర్ కాలిపోయింది. దీంతో షాపు సమీపంలో, చుట్టుపక్కల సీసీ కెమెరాలను పరిశీలించిన పోలీసులకు షాపు యజమాని, వర్కర్, గుమాస్తాల కదలికలు అనుమానాస్పదంగా కలిపించాయి. దీంతో మరింత లోతుగా విచారణ జరిపి, సాంకేతిక ఆధారాలతో నిందితులను గుర్తించారు. నేరానికి వాడిన పెట్రోల్‌బాటిల్, సెల్‌ఫోన్, షాపునుంచి తరలించిన బట్టలను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో నిందితులు సంగం రాజేశ్ (షాపు యజమాని), రాకేశ్ (వర్కర్), మధు (గుమస్తా)ను గురువారం అరెస్టు చేశామని సీఐ జాన్‌రెడ్డి తెలిపారు.

అత్యాచారయత్నం కేసులో ఏడాది జైలు శిక్ష

కోల్‌సిటీ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని రమేష్‌నగర్‌కు చెందిన ఒక మహిళపై అత్యాచారయత్నం కేసులో నేరం రుజువు కావడంతో ఆమె మామ అయిత చంద్రయ్యకు ఏడాది జైలుశిక్ష విధిస్తూ గురువారం గోదావరిఖని కోర్టు తీర్పునిచ్చింది. 2024 నవంబరు 27న తనపై అత్యాచారం చేశారంటూ బాధితురాలు గోదావరిఖని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్ఐ భూమేష్ కేసు నమోదు చేశారు. కోర్టు లైజనింగ్ ఆఫీసర్, హెడ్ కానిస్టేబుల్ శంకర్, ఏపీపీ పద్మజ, అడిషనల్ జిల్లా, సెషన్ కోర్టులో సాక్షులను ప్రవేశపెట్టగా న్యాయమూర్తి శ్రీనివాసరావు దోషికి ఏడాది కఠిన కారాగార శిక్ష విధించారు.

ట్రాక్టర్‌ను ఢీకొట్టిన టిప్పర్

● కూలీలకు గాయాలు

బోయినపల్లి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ట్రాక్టర్‌ను వేగంగా వచ్చిన టిప్పర్ ఢీకొట్టడంతో కూలీలకు గాయాలైన సంఘటన బోయినపల్లి మండలం కొత్తపేట గ్రామంలో గురువారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. నీలోజిపల్లి గ్రామానికి చెందిన కోనుకటి రవీందర్‌కు చెందిన ట్రాక్టర్‌ను కొత్తపేట గ్రామానికి చెందిన కోనుకటి తిరుపతి అద్దెకు తీసుకున్నాడు. గురువారం కూలీలను ట్రాక్టర్‌లో తరలిస్తుండగా డ్రైవర్ ఎర్రనాగరాజు కొత్తపేట ఎస్సీ కాలనీలో నిలిపాడు. వేములవాడకు చెందిన టిప్పర్ లారీని రెడ్డవేని జశ్వంత్ అనేవ్యక్తి నిర్లక్ష్యంగా, వేగంగా వచ్చి ట్రాక్టర్ ట్రైలర్‌ను ఢీకొట్టాడు. ఈ సంఘటనలో కూలీలు కుర్మ రాజవ్వ, ఎల్లండుల కమలవ్వ, ఎల్లండుల లచ్చవ్వ, కోనుకటి రమ్య, ట్రాక్టర్ డ్రైవర్ నాగరాజు రోడ్డుపై పడిపోగా వారికిగాయాలయ్యాయి. వారిని చికిత్సనిమిత్తం ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎస్ రమాకాంత్ తెలిపారు.

మోసం చేసిన కేసులో వ్యాపారి అరెస్టు

మంథని, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): సివిల్ సప్లయిస్ కార్పొరేషన్‌తో చేసుకున్న ఒప్పందాన్ని ఉల్లంఘించి మోసానికి పాల్పడిన గద్దలపల్లి లోని శ్రీలక్ష్మీప్రసన్న ఇండస్ట్రీస్ పార్ట్నర్ భైర్నేని వరప్రసాద్‌రావును అరెస్టు చేసి కోర్టులో హాజరు పర్చినట్లు సీఐ రాజు గురువారం తెలిపారు. 2023-24 సంవత్సరానికి చేసుకున్న ఒప్పందం ప్రకారం ఖరీఫ్‌సీజన్‌లో కొనుగోలు చేసిన వడ్లను రైస్‌మిల్లు ఇవ్వగా వారు 38,489క్వింటాళ్ల సివిల్‌సప్లై కార్పొరేషన్‌కు 25,680క్వింటాళ్ళ బియ్యాన్ని ఇవ్వాల్సి ఉండగా మిల్లు వ్యాపారులు వరప్రసాద్, తాటిపెల్లి శ్రీనివాస్‌లు అగ్రిమెంట్‌ను దుర్వినియోగం చేసి బియ్యాన్ని కార్పొరేషన్‌కు ఇవ్వకుండా రూ.12.37కోట్లు మోసం చేసినట్లు మేనేజర్ శ్రీకాంత్‌ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్లు తెలిపారు. ఇప్పటికే ఈ కేసులో తాటిపెల్లి శ్రీనివాస్‌ను అరెస్టు చేశామన్నారు.

ద్విచక్రవాహనం అదుపుతప్పి యువకుడి మృతి



అభినవ్(ఫైల్)

వేములవాడ టౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): వేములవాడ పట్టణంలోని రెండో బైపాస్ రోడ్డులో బుధవారం అర్ధరాత్రి ద్విచక్రవాహనం అదుపుతప్పి గోవింద్ అభినవ్(25) అనే యువకుడు అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికుల వివరాల ప్రకారం.. వేములవాడ పట్టణంలోని ఉప్పుగడ్డ వీధికి చెందిన అభినవ్ బద్దిపోచమ్మ దేవాలయంలో రోజువారికూలీగా పనిచేస్తుంటాడు. పట్టణంలోని రెండో బైపాస్ రోడ్డు నుంచి ఇంటికి వెళుతుండగా ద్విచక్రవాహనం అదుపుతప్పి అభినవ్ మురికికాలువలో పడ్డాడు. దీంతో తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. ఈవిషయం గురువారం ఉదయం వెలుగులోకి వచ్చింది. పోలీసులు సీసీకెమెరాలు పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్‌సీఐ వీరప్రసాద్ తెలిపారు.

సిద్దిపేట జిల్లాలో మండేపల్లి వాసి మృతి



తిరుపతి(ఫైల్)

తంగళ్లపల్లి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట జిల్లాలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తంగళ్లపల్లి మండలం మండేపల్లి గ్రామానికి చెందిన జడల తిరుపతి(58) మృతి చెందాడు. బంధువుల కథనం ప్రకారం... సిద్దిపేటలో బంధువులు మృతిచెందగా పరామర్శకు జడల తిరుపతి-రజిత దంపతులు ద్విచక్రవాహనంపై వెళ్తున్నారు. ఈ క్రమంలో ఎదురుగా వచ్చిన కారు ఢీకొనడంతో తిరుపతి అక్కడికక్కడే మృతిచెందాడు. భార్య రజిత తీవ్రంగా గాయపడింది. ఆమె పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది.

చికిత్స పొందుతూ మహిళ మృతి



లచ్చవ్వ(ఫైల్)

మల్యాల, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మల్యాల మండలం పోతారం గ్రామానికి చెందిన పున్న లచ్చవ్వ(59)అనే మహిళ ప్రమాదవశాత్తు నిప్పంటుకొని తీవ్ర గాయాలతో చికిత్సపొందుతూ బుధవారం రాత్రి మృతిచెందింది. ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం పున్న లచ్చవ్వ తన తల్లితో కలిసి పోతారంలో తమ్ముడి ఇంట్లో ఉంటోంది. మంగళవారం సాయంత్రం ఇంటిముందు గడ్డిని కాలుస్తుండగా ప్రమాదవశాత్తు చీరకు నిప్పంటుకుంది. దీంతో చికిత్సకోసం జగిత్యాలఏరియా ఆసుపత్రికి తీసుకెళ్లగా బుధవారం రాత్రి మృతిచెందినట్లు మృతురాలి సోదరుడు రాములు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

వరండాలోనే శిశువు మృతదేహం

● మానవత్వం మరిచిన ఆసుపత్రి సిబ్బంది

కళ్యాణ్‌నగర్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో గర్భంలో మృతి చెందిన శిశువును వరండాలో రాత్రి నుంచి ఉదయం వరకు ఉంచడంతో కుటుంబ సభ్యులకు ఏం చేయాలో తెలియక ఇబ్బందులకు గురయ్యారు. గోదావరిఖని ప్రభుత్వఆసుపత్రికి ప్రసవంకోసం మంథనికిచెందిన ఓగర్భిణి బుధవారం ఆసుపత్రిలో చేరింది. కడుపులోనే బిడ్డ అడ్డం తిరిగి మృతిచెందడంతో ఆమె భర్తకు శిశువును అప్పగించి ఆసుపత్రి సిబ్బంది చేతులు దులుపుకున్నారు. శిశువును ఏం చేయాలో అర్థంకాక లేబర్‌రూమ్ వద్ద పెయిడ్‌రూమ్‌ల వద్ద ఆ శిశువును ఉదయం 11గంటలవరకు అక్కడేఉంచారు. వాస్తవానికి శిశువు మరణించిన తరువాత కుటుంబ సభ్యుల అభిప్రాయం మేరకు ఆసుపత్రి సిబ్బంది ఖననం చేస్తారు. కానీ సిబ్బంది పట్టించుకోకుండా ఓ కాటన్ డబ్బాలో పెట్టి ఇవ్వడంతో ఏమి చేయలేక ఆ శిశువును మూలన పెట్టి ఉదయం వరకు జాగరణచేశారు. మృతిచెందిన శిశువును ప్యాకింగ్‌చేసి ఊరు చివరలో వైద్యసిబ్బంది ఖననం చేయాల్సి ఉంటుంది. శిశువును కాటన్ డబ్బాలో పెట్టి ఏమితెలియక గర్భిణి భర్త ఆసుపత్రి చుట్టూ తిరిగాడు. ఉదయం 11గంటలకు అక్కడున్నకొంతమంది శిశువు మృతదేహాన్ని చూసి వైద్యసిబ్బందిని ప్రశ్నించడంతో హడావిడిగా ఖననంచేశారు. ఆసుపత్రి సిబ్బంది ఇలా మానవత్వం మరవడంపై అక్కడున్నవారు ఆగ్రహం వ్యక్తం చేశారు. తప్పునుకప్పిపుచ్చుకోవడానికి సిబ్బందినానాతంటాలు పడ్డారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

మల్యాల, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్-జగిత్యాల మార్గంలోని కొండగట్టు సమీపంలో గల మారుతీ టౌన్‌షిప్ వద్ద ఎదురెదురుగా కారు, ద్విచక్రవాహనం ఢీకొన్న సంఘటనలో ఇద్దరికిగాయాలు అయ్యాయి. కోరుట్లకు చెందిన మనికంఠ, మకరంథ్ ద్విచక్ర వాహనంపై కళాశాలకు వెళ్లి తిరిగి వస్తుండగా టౌన్‌షిప్ ప్రాంతంలో ఎదురుగా కరీంనగర్ వైపు వస్తున్నకారు ఢీకొంది. దీంతో మనికంఠకాలుకు, మకరంథ్‌కు తీవ్ర గాయాలుకాగా చికిత్సకోసం జగిత్యాలకు తరలించారు.

వ్యక్తి అదృశ్యం

మల్యాల, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నూకపల్లి అర్బన్ హౌజింగ్ కాలనీకి చెందిన బోగ మధుసూధన్ అనేవ్యక్తి నెల రోజులుగా కనిపించడం లేదని అతడి భార్య సరిత పోలీసులకు ఫిర్యాదు చేసింది. జగిత్యాలలోని ఓరైస్‌మిల్లులో పనిచేసే మధుసూధన్ గతనెల 8న పనికి వెళ్తున్నాననిచెప్పి ఇంటినుంచివెళ్లి తిరిగిరాలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో కేసునమోదుచేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

పెద్దమ్మ ఆలయంలో చోరీ



లాకర్‌ను, హుండీని ధ్వంసం చేసిన దొంగలు

కోరుట్ల, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): కోరుట్ల పట్టణంలోని అయిలాపూర్ రోడ్డులోని పెద్దమ్మ దేవాలయంలో బుధవారం రాత్రి చోరీ జరిగినట్లు ముదిరాజ్ సంఘ నాయకులు తెలిపారు. ఆలయంలోని ప్రధాన ద్వారం తాళం పగులగొట్టి ఆలయంలో ఉన్న వెండి, బంగారు ఆభరణాలతో పాటు హుండీ, లాకర్‌లో ఉన్న నగదును ఎత్తుకెళ్లినట్లు వారు తెలిపారు. హుండీలో సుమారుగా రూ.5వేల వరకు నగదు ఉంటుందని వారు తెలిపారు. సంఘ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బైపాస్ ఫ్లైఓవర్ గోడ ధ్వంసం



ధ్వంసమైన గోడ

కరీంనగర్ క్రైం, నవంబరు (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ శివారులోని బొమ్మకల్ బైపాస్‌రోడ్‌లో గ్రానైట్‌లారీ అదుపుతప్పి ఫ్లైఓవర్ గోడను ఢీకొట్టడంతో లారీలో ఉన్న భారీ గ్రానైట్‌రాయి ఫ్లైఓవర్ గోడకు తాకడంతో గోడ ధ్వంసమైంది. గురువారం రాత్రి 7గంటల సమయంలో ఈ ప్రమాదం జరిగింది. సుల్తానాబాద్ వైపు నుంచి హైదరాబాద్ వైపు వెళుతున్న గ్రానైట్ లారీ అదుపుతప్పటంతో పెద్ద బండరాయి ఫ్లైఓవర్ గోడను ఢీకొంది. దీంతో గోడకు పెద్ద రంధ్రం ఏర్పడి ధ్వంసమైంది. ఫ్లైఓవర్ గోడకు పెద్దరంధ్రం ఏర్పడి ప్రమాదకరంగా మారిందని ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు మునిగంటి అనిల్ తెలిపారు.

ఆర్టీసీ డ్రైవర్‌పై దాడి చేసిన నిందితుడి అరెస్టు



నిందితుడి అరెస్టు చూపుతున్న పోలీసులు

ఇల్లంతకుంట, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ డ్రైవర్ కల్లూరి బాలరాజుపై దాడి చేసిన నిందితుడు పిట్ల శ్రీకాంత్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సిరిసిల్ల రూరల్ సీఐ మొగిలి, ఎస్సై సిరిసిల్ల అశోక్‌లు తెలిపారు. పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలు వెల్లడించారు. సిరిసిల్ల డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు బుధవారం ఇల్లంతకుంట నుంచి సిరిసిల్లకు బయలుదేరింది. వల్లంపట్ల గ్రామసమీపంలో ఆర్టీసీ డ్రైవర్ సైడ్ ఇవ్వలేదని సిద్దిపేట జిల్లా చిన్నకోడూర్ మండలం గంగాపూర్‌కు చెందిన శ్రీకాంత్ కారు కొంత దూరం వెళ్లిన తర్వాత తిప్పుకొని వచ్చి ఆర్టీసీ బస్సుకు ఎదురుగా నిలిపాడు. డ్రైవర్ బాలరాజును దుర్భాషలాడి, బస్సు క్యాబిన్‌లోకి వచ్చి డ్రైవర్‌పై దాడిచేశాడు. బస్సు అద్దాన్ని పగలగొట్టడానికి రాయితో విసరగా అద్దం పగిలి రోడ్డుపక్కన కూర్చున్న వల్లంపట్ల గ్రామానికి చెందిన సంది వజ్రవ్వకు తగిలింది. ఘటనను ప్రశ్నించిన ఒబులాపూర్ గ్రామానికి చెందిన బత్తుల రాజవ్వ అనే ప్రయాణికురాలితో శ్రీకాంత్ వాగ్వాదానికి దిగాడు. బస్సులో జరిగిన ఘటనను బస్సు మహిళా కండక్టర్ కాళేశ్వరి తన మొబైల్‌ఫోన్‌లో వీడియో తీసింది. వీడియో సోషల్ మీడియాల్ వైరల్ కావడంతో నిందితుడు పరారయ్యాడు. ఆర్టీసీ డ్రైవర్ ఫిర్యాదు మేరకు కేసునమోదు అయ్యింది. ఎస్పీ ఆదేశాల మేరకు ఎస్సై అశోక్ ఆధ్వర్యంలో మూడు టీంలు ఏర్పాటు అయ్యి, సాంకేతిక ఆధారంగా గురువారం రహీంఖాన్‌పేట గ్రామసమీపంలో నిందితున్ని అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

ఆర్‌ఎఫ్‌సీఎల్ ప్లాంట్ వద్ద పాతయంత్రాల తరలింపు వివాదం

కోల్‌సిటీ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఆర్ఎఫ్‌సీఎల్ నిర్మాణ కాంట్రాక్టు పనులు నిర్వహించిన సింప్లెక్స్ సంస్థ తన యంత్ర సామాగ్రిని తరలించే విషయంలో వివాదం నెలకొన్నది. ఆర్ఎఫ్‌సీఎల్ ప్లాంట్ బయట ఉన్న ఈ సామాగ్రిని తరలిస్తుండగా ఆర్ఎఫ్‌సీఎల్ సామాగ్రి ఉందంటూ కొందరు అభ్యంతరాలు వ్యక్తం చేశారు. దీంతో తరలింపును నిలిపివేశారు. రెండు నెలల క్రితం ట్రాన్స్‌పోర్టర్ విషయంలో వివాదం నెలకొన్నది. ఆర్ఎఫ్‌సీఎల్ అధికారులు మాత్రం ఆసామాగ్రికి, మాకుసంబంధం లేదని పేర్కొంటున్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

ఇబ్రహీంపట్నం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకొని తహసీల్దార్ కార్యాలయానికి తరలించి రూ.10 వేల జరిమానా విధించారు. గురువారం నిజామాబాద్ జిల్లా ఎర్గట్ల గ్రామం నుంచి ఇబ్రహీంపట్నం మండలంలోని కోమటికొండాపూర్ గ్రామానికి ఇసుకను ట్రాక్టర్ ద్వారా రవాణా చేస్తుండగా రెవెన్యూ అధికారులు పట్టుకున్నారు. ఈ మేరకు ట్రాక్టర్‌ను తహసీల్దార్ కార్యాలయానికి తరలించి రూ.10 వేల జరిమానా విధించినట్లు తహసీల్దార్ వరప్రసాద్ తెలిపారు.

ముగ్గురు ప్రభుత్వ ఉపాధ్యాయుల సస్పెన్షన్

● జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు డీఈవో ఉత్తర్వులు

హుజూరాబాద్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్‌లో ముగ్గురు ప్రభుత్వ ఉపాధ్యాయులను సస్పెండ్ చేస్తూ జిల్లాకలెక్టర్ ఆదేశాల మేరకు గురువారం డీఈవో ఉత్వర్వులు జారీచేశారు. హుజూరాబాద్ మండలంలోని చెల్పూర్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న ఎం అయిలయ్య విధులకు సక్రమంగా నిర్వహించడం లేదని, ఉన్నతాధికారుల ఆదేశాలను పట్టించుకో వడం లేదనే ఫిర్యాదులు అందాయి. అలాగే హుజూరాబాద్ పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ప్రవీణ్‌కుమార్, ఏ సమ్మయ్యలు మద్యం తాగి పాఠశాలకు హాజరైనట్లు ఆరోపణలు వచ్చాయి. దీనిపై విచారణ జరిపిన డీఈవో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతికి నివేదిక అందజేశారు. ఈ మేరకు కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేయగా ముగ్గురు ఉపాధ్యాయులను సస్పెండ్ చేశారు. హుజూరాబాద్ డివిజన్‌లోని సైదాపూర్, శంకరపట్నం, జమ్మికుంట ప్రభుత్వ పాఠశాలల్లోని ఉపాధ్యాయులు మద్యం సేవించి విధులకు హాజరవుతున్నట్లు ఆరోపణలున్నాయి.

జాతీయ స్కౌట్స్, గైడ్స్ క్యాంప్‌నకు ఖని విద్యార్థులు



జెండా ఊపి వాహనాన్ని ప్రారంభిస్తున్న ఎంఈవో

కోల్‌సిటీటౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఉత్తరప్రదేశ్ రాజధాని లక్నోలో ఈనెల 25నుంచి 29వరకు జరగనున్న స్కౌట్స్ అండ్ గైడ్స్ జాతీయ జంబోరిలో పాల్గొనడానికి ఖని విద్యార్థులు గురువారం తరలివెళ్లారు. 8మంది స్కౌట్స్, 8మంది గైడ్స్, గైడ్ కెప్టెన్ విజయ, స్కౌట్ మాస్టర్ రవీందర్‌ల ఆధ్వర్యంలో శ్రీరామ విద్యానికేతన్, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, కేజీబీవీ సుల్తానాబాద్ విద్యార్థుల బృందం వెళ్లారు. రామగుండం ఎంఈవో జింక మల్లేశం జెండా ఊపి విద్యార్థుల వాహనాన్ని ప్రారంభించారు.

బీజేపీలో విభేదాలు లేవు

● మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ ఈటల రాజేందర్

కరీంనగర్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): బీజేపీలో విభేదాలు లేవని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ స్పష్టం చేశారు. గురువారం కరీంనగర్‌లో విలేకరులతో మాట్లాడుతూ ఏ పార్టీలోనైనా అంతర్గత విభేదాలు సహజమని అన్నారు. స్థానిక ఎన్నికల్లో అందరం కలిసి పెద్ద మొత్తంలో స్థానాలను గెలుచుకోవడమే లక్ష్యంగా పని చేస్తామన్నారు. హుజూరాబాద్‌లో జరిగే కార్యక్రమాలపై తనకు సమాచారం ఉందని, తన వ్యక్తిగత కారణాలతోనే రాలేక పోయానన్నారు. బీజేపీ నాయకుల మధ్య గ్యాప్ ఉందన్నదని సోషల్ మీడియా సృష్టి మాత్రమే అన్నారు. మావోయిస్టుల లొంగుబాటు, ఎన్‌కౌంటర్లపై కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా స్టాండే తమ స్టాండ్ అని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. గ్రామ పంచాయితీల్లో పాలకులు లేక అభివృద్ధి కుంటుపడి పోయిందన్నారు. 25 సంవత్సరాలుగా ప్రజాక్షేత్రంలో ఉన్న నాయకుడిగా రాష్ట్ర వ్యాప్తంగా బీజేపీకి పెద్ద ఎత్తున సర్పంచులు, ఎంపీటీసీలు, జడ్పీటీసీ స్థానాలను గెలిపించుకుంటామన్నారు.

● గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలి

జమ్మికుంట రూరల్: గ్రామపంచాయతీ ఎన్నికలు వెంటనే నిర్వహించాలని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. గురువారం జమ్మికుంట పట్టణంలోని హౌసింగ్‌బోర్డు కాలనీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమా వేశంలో మాట్లాడారు. గ్రామపంచాయతీల్లో పాలకవర్గాలు లేక రెండేళ్లు అవుతుందన్నారు. రాష్ట్రప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలన్నారు. 25ఏళ్లుగా ఇక్కడి ప్రజలతో అనుబంధం ఉందన్నారు. త్వరలో బీజేపీ బూత్ కమిటీ అధ్యక్షులు, సభ్యులతో సమావేశం ఏర్పాటు చేస్తామన్నారు. రైతులకు సన్న వడ్లకు బోనస్ ఇచ్చి రుణమాఫీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బీఫామ్‌లతో సంబంధం లేకుండా ప్రజలమధ్యలో ఉండి ప్రజలు మెచ్చిన నచ్చిన వాళ్లను గెలిపించుకుంటామన్నారు. ఇకనుంచి నియోజకవర్గంలో అందుబాటులో ఉంటానని తెలిపారు. సమావేశంలో చొప్పదండి మాజీ ఎమ్మెల్యే బొడిగెశోభ, ఎరబెల్లి సంపత్‌రావు, ఎర్రంరాజు సురేందర్‌రావు పాల్గొన్నారు.

ఉమ్మడిజిల్లా స్థాయి ఎస్‌జీఎఫ్ రెజ్లింగ్ పోటీలు

● హాజరైన 130 మంది క్రీడాకారులు



రెజ్లింగ్ పోటీలను ప్రారంభిస్తున్న అతిథులు

కరీంనగర్ స్పోర్ట్స్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లా పాఠశాలల క్రీడా సమాఖ్య(ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాస్థాయి అండర్-14, 17 రెజ్లింగ్‌పోటీలకు విశేషస్పందన లభించింది. జిల్లాకేంద్రంలోని ప్రాంతీయ క్రీడాపాఠశాలలో నిర్వహించిన ఈపోటీలకు ఉమ్మడి జిల్లాలోని వివిధప్రాంతాల నుంచి 100మంది బాలురు, 30మంది బాలికలు హాజరయ్యారు. ఈ పోటీలను జిల్లా పాఠశాలల క్రీడా సమాఖ్య కార్యదర్శి బాసబోయిన వేణుగోపాల్, ఉమ్మడిజిల్లా రెజ్లింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎండీ కరీంలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో రెజ్లింగ్ క్రీడకు మంచి ఆదరణ ఉందన్నారు. గతంలో జిల్లా క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయిలో పాల్గొని ప్రతిభ చాటారని, వారిని స్ఫూర్తిగా తీసుకొని జిల్లా క్రీడాకారులు ఎదగాలన్నారు. ఈ పోటీల్లో ప్రథమ స్థానం సాధించిన క్రీడాకారులను రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీల్లో పాల్గొనే ఉమ్మడి జిల్లాజట్లకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో తెలంగాణ ఖో-ఖో అసోసియేషన్ రిఫరీస్ బోర్డు కన్వీనర్ వంగపల్లి సూర్యప్రకాష్, పోటీల కన్వీనర్ బి సత్యనారాయణ, మాజీ ఎస్‌జీఎఫ్ కార్యదర్శి పోతన శ్రీనివాస్, వ్యాయామ ఉపాధ్యాయులు సఫియా, ఎస్ శ్యామలదేవి, రెజ్లింగ్ కోచ్‌లు వంశీకృష్ణ, ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల కష్టాలు తీరేదెప్పుడో..?



చిత్రవేణిగూడె వెళ్లే రోడ్డు

● చిత్రవేణిగూడెం, చిన్నకొల్వాయి గ్రామాలకు నడవని బస్సులు
● ఎటు వెళ్లాలన్నా మైళ్ల దూరం నడవాల్సిందే
● ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు, వృద్ధులు

బీర్‌పూర్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): కాలాలు మారినా, ప్రభుత్వాలు మారినా గిరిజనులకు రవాణా సౌకర్యం కల్పించడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. బీర్‌పూర్ మండలంలో 17 గ్రామ పంచాయతీలు ఉండగా పలు గ్రామాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం లేక గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని చిత్రవేణిగూడెం, చిన్నకొల్వాయి గ్రామాల ప్రజలు ఎటు ప్రయాణం చేయా లన్నా మైళ్ల దూరం కాలినడకన వచ్చి ఆర్టీసీ బస్సు ఎక్కాల్సిందే. ఒకప్పుడు చిత్రవేణిగూడెం గ్రామం తాళ్లధర్మారానికి అనుబంధ గ్రామంగా, చిన్నకొల్వాయి గ్రామం కొల్వాయికి అనుబంధంగా ఉండేవి. నూతన పంచా యతీలు ఏర్పడిన తర్వాత చిత్రవేణిగూడెం, చిన్న కొల్వాయి గ్రామాలు జీపీలుగా ఏర్పడినా ఆర్టీసీ బస్సు సౌకర్యానికి మాత్రం నోచుకోవడం లేదు. దీంతో అత్యవసర సమయాల్లో వేరే ప్రాంతాలకు వెళ్లాలంటే ఇబ్బందులు ఎదురవుతున్నాయని గిరిజనులు వాపోతున్నారు.

నాలుగు కి.మీ.లు నడిస్తేనే బస్సు

చిత్రవేణిగూడెం గ్రామ ప్రజలు ఏదైనా పని నిమిత్తం బీర్‌పూర్ మండల కేంద్రానికి వెళ్లాలంటే 10 కి.మీ.లు ప్రయాణించాలి. బస్సు సౌకర్యం లేక చిత్రవేణిగూడెం ప్రజలు బీఆర్‌పూర్ వెళ్లాలంటే 4 కి.మీ. కాలినడకన తాళ్లధర్మారం వరకు రావాల్సి ఉంటుంది. అక్కడి నుంచి బీఆర్‌పూర్‌కు బస్సులో వెళ్తారు. చిత్రవేణిగూడెంలో ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాల ఉంది. ఈ పాఠశాలలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఆయా ప్రాంతాలకు చెందిన విద్యార్థులు చదువుతున్నారు. విద్యార్థులను చూసేందుకు తల్లిదండ్రులు, బంధువులు ఆయా ప్రాంతాల నుంచి పాఠశాలకు వస్తుంటారు. విద్యార్థులు, తల్లిదండ్రులు తాళ్ళధర్మారం గ్రామంలోని ప్రధాన రహదారి వద్ద దిగి చిత్రవేణిగూడెంకు కాలినడకన వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. గ్రామానికి తారు రోడ్డు సౌకర్యం ఉన్నప్పటికీ బస్సులు రావడం లేదని గిరి జనులు పేర్కొంటున్నారు.

మండలంలోని కొల్వాయి గ్రామానికి నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న చిన్నకొల్వాయికి కూడా బస్సు సౌకర్యం లేదు. దీంతో గిరిజనులు చిన్నకొల్వాయికి వెళ్లాలంటే కొల్వాయి నుంచి మైళ్ల దూరం నడవాల్సిందే. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి అనుబంధ గ్రామాల ప్రజలకు సైతం బస్సు సౌకర్యం కల్పించేలా చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల గిరిజనులు కోరుతున్నారు.

బస్సు సౌకర్యం కల్పించాలి
: కోట్నాక గంగవ్వ, చిన్నకొల్వాయి



ప్రతి పనికి కొల్వాయి వెళ్లాలి. ఏదైనా ఊరికి వెళ్లాలంటే నాలుగు కిలోమీటర్లు నడిచి వచ్చి బస్సు ఎక్కాలి. చిన్నపిల్లలు, వృద్ధులు నడవడం చాలా ఇబ్బంది అవుతుంది. సార్లు మా బాధలు పట్టించుకోవాలి. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి చిన్నకొల్వాయికి బస్సు సౌకర్యం కల్పించాలి.



చిన్న కొల్వాయికి వెళ్లే రోడ్డు

ఎన్నోసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లాం
చిక్రం మారుతి, చిత్రవేణిగూడెం



గ్రామస్థులు ఏదైనా గ్రామం వెళ్లాలంటే నాలుగు కిలోమీటర్ల దూరం కాలినడకన నడిచి వచ్చి బస్సు ఎక్కాలి. గ్రామంలోని 35మంది బాలికలు చదువుకోవడానికి నాలుగు కిలోమీటర్ల దూరం కాలినడకన తాళ్ళధర్మారం గ్రామానికి వచ్చి చదువుకుంటున్నారు. ఆర్టీసీ అధికారులు స్పందించి గ్రామస్థుల సమస్య తీర్చాలి.

రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలకు జడ్పీ విద్యార్థులు

చొప్పదండి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): నల్గొండలో ఈనెల 22నుంచి జరిగే ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి నెట్‌బాల్ అండర్-17 పోటీలకు చొప్పదండి జడ్పీస్కూల్ విద్యార్థులు ఎంపికయ్యారు. ఉమ్మడిజిల్లా జట్టులోకి విద్యార్థులు టి తరుణ్, యు వినీత్, సీహెచ్ కృష్ణ, పి అక్షయ, బి శ్రీదేవి ఎంపికైనట్లు పాఠశాల ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు ఎండి జలీల్ తెలిపారు. ఈనెల12న జగిత్యాలలో జరిగిన ఉమ్మడిజిల్లాస్థాయి నెట్‌బాల్ పోటీల్లో విద్యార్థులు ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు.

23న ఉమ్మడి జిల్లా సీనియర్స్ బాస్కెట్‌బాల్ జట్ల ఎంపిక పోటీలు

కరీంనగర్ స్పోర్ట్స్ నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లా బాస్కెట్‌బాల్ అసోసి యేషన్ ఆధ్వర్యంలో ఈనెల 23న ఉమ్మడి కరీంనగర్ జిల్లాసీనియర్స్ మహిళలు, పురుషుల బాస్కెట్‌బాల్ జట్లఎంపిక పోటీలను నిర్వహించనున్నారు. జిల్లా కేంద్రంలోని డాక్టర్ అంబేడ్కర్ స్టేడియంలో ఉదయం 9గంటలనుంచి ఈ పోటీలను నిర్వహించనున్నామని జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ప్రధానకార్యదర్శి బి అనంతరెడ్డి తెలిపారు. ఈ పోటీలలో ప్రతిభచాటే క్రీడాకారులను రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొనే ఉమ్మడిజిల్లా జట్లకుఎంపిక చేయనున్నామని తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని ఆసక్తిగల క్రీడాకారులు ఈపోటీలలో పాల్గొనవచ్చని ఆయన పేర్కొన్నారు.

ఎస్‌యూ పీజీ మూడో సెమిస్టర్ పరీక్ష ఫీజు షెడ్యూల్ విడుదల

గణేశ్‌నగర్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఎంఏ, ఎంఎస్సీ, ఎంఎస్‌డబ్ల్యూ, ఎంకామ్ (సీఏ), ఎంకామ్ (బ్యాంకింగ్ ఇన్సూరెన్స్), ఎంకామ్, సీఏ (ఎఫ్ఏ) కోర్సులకు మూడవ సెమిస్టర్ పరీక్షఫీజు షెడ్యూల్‌ను గురువారం శాతవాహన విశ్వవిద్యాలయ పరీక్షలు నియంత్రణ అధికారి డి.సురేష్‌కుమార్ విడుదల చేశారు. పరీక్షలు డిసెంబర్‌లో జరుగుతాయని తెలిపారు. వివరాలకు యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో చూడాలని, లేదా ఆయా కళాశాలల్లో సంప్రదించాలని తెలిపారు.

కళాశాలల్లో ఫేస్ రికగ్నిషన్ తప్పనిసరి

● ఎస్‌యూ ఉపకులపతి ఆచార్య ఉమేష్‌కుమార్

గణేశ్‌నగర్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయ పరిధిలోని అన్ని డిగ్రీ, పీజీ ప్రభుత్వ, ప్రైవేటు, అనుబంధ కళాశాలల్లో ఫేస్‌రికగ్నిషన్ తప్పనిసరి అని ఎస్‌యూ ఉపకులపతి ఆచార్య ఉమేష్‌కుమార్ తెలిపారు. గురువారం శాతవాహన విశ్వవిద్యాలయ పరిధిలోని అన్ని డిగ్రీ,పీజీ ప్రభుత్వ, ప్రైవేటు, అనుబంధ కళాశాలల ప్రిన్సిపల్స్, సెక్రెటరీలు, కరస్పాండెంట్లతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విశ్వవిద్యాలయ నిబంధనల మేరకు అన్ని కళాశాలల్లో విద్యార్థులకు ఫేస్ రికగ్నిషన్ తప్పనిసరి చేయాలని అన్నారు. విశ్వవిద్యాలయ ఆవరణలోని అన్నికళాశాలల్లో విద్యార్థులకు, అధ్యాపకులకు, బోధనేతర సిబ్బందికి ఫేస్‌రికగ్నిషన్ అమలు చేస్తున్నట్లు తెలిపారు. రిజిస్ట్రార్ ఆచార్యరవికుమార్ మాట్లాడుతూ విద్యార్థులకు ఫేస్‌రికగ్నిషన్ వలన క్రమశిక్షణ అలవడి కళాశాలకు క్రమం తప్పకుండా వస్తారని ఇది విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. సమావేశంలో పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ డి సురేష్‌కుమార్, ఓఎస్డీ టు వీసీ డాక్టర్ బి హరికాంత్, విశ్వవిద్యాలయ అకాడమిక్ డైరెక్టర్ డాక్టర్ సరసిజ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్‌యూ ఉపకులపతి ఆచార్య ఉమేష్‌కుమార్

అజ్ఞానపు చీకట్లను పారదోలేదే దీపం..

● హంపి పీఠాధిపతి విద్యారణ్యభారతీ స్వామి ● గంగమ్మకు దీప హారతి



హారతి ఇస్తున్న విద్యారణ్యభారతీ స్వామి



కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు

ఎల్లారెడ్డిపేట, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): అజ్ఞానపు చీకట్లను దూరం చేసి జ్ఞాన జ్యోతులను నింపేదే దీపం అని హంపి పీఠాధిపతి విద్యారణ్యభారతీ స్వామి అన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్ గ్రామ శివారులోని జక్కుల చెరువు వద్ద హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో కార్తీక దీపోత్సవ కార్యక్రమాన్ని గురువారం రాత్రి వైభవంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హంపి పీఠాధిపతి విద్యారణ్యభారతీ స్వామి హాజరై గంగమ్మకు దీపార్చన, ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం భక్తులకు అనుగ్రహభాషణం చేశారు. నిత్యం ప్రతి ఇంట్లో ఉదయం, సాయంత్రం సమయంలో దీపారాధన చేస్తే శుభప్రదమన్నారు. ఏ కార్యం చేపట్టిన జ్యోతిని వెలిగించే గొప్పదనం హిందూ సంస్కృతిదని అన్నారు. దీపం వెలిగిస్తే మనిషిలోని అహం అంతమై కాంతుల్లో ఆశలు చిగురిస్తాయని అన్నారు. నిత్యం దీపాన్ని ఆరాధిస్తే జ్ఞానం, సంపద సమకూరుతుందన్నారు. మహిళలు భారీ సంఖ్యలో తరలివచ్చి నీటిలో దీపాలను వదిలారు. కార్యక్రమంలో వేదపండితులు రాచర్ల రఘురామశర్మ, రాచర్ల విశ్వనాథశర్మ, ఉత్సవ సమితి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు. ఎస్ఐ రాహుల్‌రెడ్డి ఆధ్వర్యంలోని పోలీసులు భద్రత చర్యలు చేపట్టారు.

వైభవంగా దీపోత్సవం

● కార్తీకమాస ముగింపు సందర్భంగా ధర్మపురి,వేములవాడల్లో భక్తుల ప్రత్యేక పూజలు



ధర్మపురిలో దీపోత్సవం కార్యక్రమం



కార్తీక మాసం ముగింపు హారతి ఇస్తున్న అర్చకులు



వేములవాడలో భీమన్న సన్నిధిలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు

ధర్మపురి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం ముగింపు సందర్భంగా ధర్మపురి క్షేత్రంలో గోదావరి నదీతీరాన అనంత దీపోత్సవం కార్యక్రమాన్ని గురువారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఆలయ వేదపండితులు, అర్చకులు గోదావరినది వరకు శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం నదీతీరాన శివలింగానికి రుద్రాభిషేకం, ప్రత్యేకపూజలు చేశారు. నదీతీరాన గల స్నానఘట్టాల మెట్లపైన ప్రత్యేకంగా దీపాలు ఏర్పాటు చేశారు. ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ తదితర వేద బ్రాహ్మణుల మంత్రోచ్చరణల మధ్య ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు నదిలో దీపాలు వదిలి భక్తిప్రపత్తులు చాటుకున్నారు. కార్యక్ర మంలో ఆలయఈవో సంకటాల శ్రీనివాస్, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్, ధర్మపురి సీబిరాంనర్సింహారెడ్డి, శారదా మహిళామండలి, వాసవి మహిళామండలిసభ్యులు, కరీంనగర్ తిరుమల సేవా గ్రూపుసభ్యులు, పెద్దపల్లి శ్రీవల్లిసేవాగ్రూపు సభ్యులు, స్థానికమహిళలు, సిబ్బంది,భక్తులు పాల్గొన్నారు.

భీమన్న సన్నిధిలో కార్తీక వేడుకలు

వేములవాడ టౌన్: వేములవాడ భీమేశ్వరాలయంలో కార్తీక వేడుకలు గురువారం రాత్రి వైభవంగా నిర్వహించారు. ఉత్సవాల్లో చివరిరోజున ఆలయఈవో రమాదేవి కార్తీకదీపాలను వెలిగించి ప్రారంభించగా, సుహాసినులు, భక్తులు కార్తీకదీపాలు వెలిగించారు. సుహాసినులకు వాయినం ఇచ్చి పసుపు, కుంకుమ, అక్షింతలు, గాజులతోపాటు స్వామివారి ఫోటోను ఈవో అంద జేశారు. దీంతో కార్తీక మాసోత్సవాలు ముగిశాయి.

ఉత్తమ సహకార సంఘంగా సుల్తానాబాద్ సొసైటీ



అవార్డు అందుకుంటున్న సుల్తానాబాద్ సింగిల్‌విండో చైర్మన్ శ్రీనివాస్

సుల్తానాబాద్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): సహకార సంఘాల వారోత్సవాలను పురస్కరించుకొని సుల్తానాబాద్ సహకారసంఘాన్ని ఉత్తమ సంఘంగా ఎంపికచేశారు. గురువారం హైదరాబాద్ జరిగిన అవార్డుల ప్రధాన కార్యక్రమంలో సొసైటీచైర్మన్ శ్రీగిరిశ్రీనివాస్ అవార్డు అందుకున్నారు. సహకార వారోత్సవాల సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఉత్తమ చైర్మన్ అవార్డులను ప్రదానం చేశారు. సహకారసంఘాల సమాఖ్య మాజీజాతీయ అధ్యక్షుడు కొండూరి రవీందర్‌రావు చేతులమీదుగా శ్రీనివాస్ అవార్డును అందుకున్నారు. చైర్మన్ శ్రీనివాస్ మాట్లాడుతూ సభ్యుల సహకారం, సంఘంపై విశ్వాసం వల్లే విజయాలు సాధ్యమయ్యాయని తెలిపారు. సంఘ అభివృద్ధికి సహకరిస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు, కేడీసీసీబ్యాంక్ అధ్యక్షుడు రవీందర్‌రావు, అధికారులు, పాలకవర్గ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు.

ఎల్లారెడ్డిపేట ప్యాక్స్ చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డికి..

ఎల్లారెడ్డిపేట: సహకారసంఘాన్ని బలోపేతం చేయడంతోపాటు లాభాల బాటలోకి తీసుకురావడానికి విశేషకృషి చేసిన ఎల్లారెడ్డిపేట ప్యాక్స్ చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి సహకార ఉత్తమ ప్రదర్శన అవార్డును అందుకున్నారు. తెలంగాణ సహకార సంఘం ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని సహకార సంఘ భవనంలో నిర్వహించిన వారోత్సవాల్లో భాగంగా గురువారం అవార్డుల ప్రధానోత్సవకార్యక్రమాన్ని నిర్వహించారు. ఉత్తమసేవలు అందించినందుకు కృష్ణారెడ్డి నాఫ్‌స్కాబ్ చైర్మన్ రవీందర్‌రావు చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. అవార్డు అందుకోవడంపై ప్యాక్స్ డైరెక్టర్లు, రైతులు, పలువురు హర్షం వ్యక్తం చేశారు.



అవార్డు అందుకుంటున్న ప్యాక్స్ చైర్మన్ కృష్ణారెడ్డి

శ్రీరాంసాగర్‌కు స్వల్పంగా ఇన్‌ఫ్లో

జగిత్యాల, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్‌లోకి ఎగువ ప్రాంతాల నుంచి గురువారం స్వల్పంగా నీరు వచ్చి చేరుతోంది. ఎగువప్రాంతం నుంచి ప్రాజెక్టులోకి 9,338క్యూసెక్కుల వరదవచ్చి చేరుతోంది. ప్రాజెక్టు నుంచి సరస్వతీకాలువ ద్వారా 650క్యూసెక్కులు, ఎస్కేప్ గేట్ల ద్వారా గోదావరిలోకి 8వేల క్యూసెక్కులు, తాగు నీటి అవసరాల కోసం మిషన్‌భగీరథ ద్వారా 231 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 457 క్యూసెక్కుల నీరు పోతోంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 80.501 టీఎంసీలు కాగా అంతేస్థాయి నీటిమట్టంతో ప్రాజెక్టు నిండుకుండలా ఉంది.



శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో నిల్వ ఉన్న నీరు

షార్ట్‌సర్క్యూట్‌తో హార్వెస్టర్‌లో మంటలు

● రూ.5 లక్షల ఆస్తి నష్టం

జగిత్యాలరూరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): జగిత్యాలరూరల్ మండలంలోని పొలాసగ్రామంలో గురువారం వరికోస్తుండగా హార్వెస్టర్‌కు షార్ట్‌సర్క్యూట్ సంభవించి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. అప్రమత్తమైన డ్రైవర్‌వెంటనే కిందకి దూకి ఫైర్‌సిబ్బందికి ఫోన్‌చేశారు. తక్షణమే స్పందించిన ఫైర్‌సిబ్బంది మంటలు ఆర్పివేయడంతో పెనుప్రమాదంతప్పింది. ఈప్రమాదంలో హార్వెస్టర్ యజమానికి సుమారు రూ.5లక్షలు నష్టం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్‌వో కృష్ణకాంత్, ఏఎల్ఎఫ్ఎఫ్ వెంకటేశ్వర్లు, ఆపరేటర్లు మల్లేశం, ప్రణయ్, ఫైర్‌ఫైటర్స్ భాస్కర్, రాజేందర్, గంగేష్ పాల్గొన్నారు.



హార్వెస్టర్‌కు అంటుకున్న మంటలను ఆర్పివేస్తున్న ఫైర్ సిబ్బంది

కొనుగోలు కేంద్రం వద్ద రైతుల నిరసన



కొనుగోలు కేంద్రం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

తంగళ్లపల్లి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ధాన్యం తరుగు పేరుతో దోపిడీ చేస్తున్నారని తంగళ్లపల్లి మండలం తాడూరులో కొనుగోలు కేంద్రం వద్ద రైతులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లడుతూ వరిధాన్యం ఒక బ్యాగులో 42 కిలోల 600 గ్రాములు తుకం వేస్తున్నారని అన్నారు. తూకం వేసిన తర్వాత రైస్ మిల్లులో అన్‌లోడ్ చేసేటప్పుడు బ్యాగు నుంచి ఐదు బ్యాగుల వరకు తరుగు అంటూ రైస్ మిల్లర్లు, అధికారులు, కేంద్రం నిర్వహకులు దోపిడీ చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 14 మ్యాచర్ వస్తేనే కాంటా పెట్టారని, ఇప్పుడు 17 మ్యాచర్ ఉంటేనే వరిధాన్యం కాంటా పెడ్తామంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వర్షానికి ఇప్పటికే పంట నష్టపోయిన రైతులు వరిధాన్యం విక్రయిస్తే ఇక్కడ నష్టమే చేస్తున్నారన్నారు. కొనుగోలు కేంద్రాలలో ఇదే తంతు జరుగుతుందని ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకుని రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

మైనార్టీ గురుకుల పాఠశాల తనిఖీ



వంటలను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో రజిత

తంగళ్లపల్లి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని బాలికల మైనార్టీ గురుకుల పాఠశాలను జిల్లా వైద్యాధికారి రజిత గురువారం తనిఖీ చేశారు. వంటకాలతోపాటు నిల్వ ఉన్న సరుకులు, గుడ్లను పరిశీలించారు. వ్యక్తిగత పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. చలి ఎక్కువగా ఉన్నందున ఉన్ని దుస్తులు ధరించి ఆరోగ్యం కాపాడుకోవాలని, వంటచేసేవారు శుభ్రతతో ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సంపత్ కుమార్, సీహెచ్‌వో బాలచంద్రం తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో పనులు పూర్తి చేయాలి

- గడువులోగా అందుబాటులోకి తీసుకురావాలి - అభివృద్ధి పనులకు స్థలాలు గుర్తించాలి - ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): వేములవాడ నియోజకవర్గంలో అధికారులు సమన్వయంతో పని చేసి అభివృద్ధి పనులు పూర్తి చేయాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. నియోజకవర్గంలో చేపడుతున్న అభివృద్ధి పనుల పురోగతిపై వివిధ శాఖల అధికారులతో మున్సిపల్‌కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఇన్‌చార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్‌తో కలిసి గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. లోఓల్టేజ్ సమస్య పరిష్కారానికి, సరఫరాలో ఇబ్బందులు దూరం చేసేందుకు హైఓల్టేజీ సబ్‌స్టేషన్‌లను మంజూరుచేశారు. అలాగే సబ్‌స్టేషన్ల పనితీరుపై ఆరా తీశారు. రైతు విజ్ఞాన కేంద్రం నిర్మాణానికి 50 ఎకరాల భూమి గుర్తించాలని, తాత్కాలిక భవనం కేటాయించాలని సూచించారు. రూ.10 కోట్లతో ప్రత్యేక అభివృద్ధి నిధులు మంజూరు చేశామని, సామాజిక భవనాలు, తదితర వాటికి నిధులను కేటాయించామన్నారు. రూ. 15 కోట్లతో పంచాయతీరాజ్ శాఖ ద్వారా మంజూరు చేయించి, పనుల జాతరలో భాగంగా గ్రామపంచాయతీ భవనాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ఆరోగ్య ఉపకేంద్రాలు, నిర్మాణ శంకుస్థాపన చేసిన పనుల పురోగతిపై ఆరా తీశారు. బీటీ రోడ్లు, సీసీరోడ్ల నిర్మాణాల పనులు ప్రారంభం కాకుండా ఉన్న వాటిని యుద్ధప్రాతిపదికన చేపట్టాలని సూచించారు. మలవాగు వంతెనకు 2015లో శంకుస్థాపన చేసి, పనులు ప్రారంభించకుండా ఉంచారని, ఈ మధ్య తిరిగి శంకుస్థాపన చేశామని వివరించారు. వంతెన నిర్మాణం కోసం రూ.6.90కోట్లు భూసేకరణకు కేటాయించామన్నారు. పనులు ప్రారంభించి వచ్చే వర్ష కాలంలోగా వంతెన నిర్మాణం పూర్తిచేయాలని ఆదేశించారు. భారీ వర్షాల నేపథ్యంలో దెబ్బతిన్న కల్వర్టులు రహదారుల మరమ్మతు పనులపై ఆరా తీశారు. దెబ్బతిన్న రహదారులు, కల్వర్టులు, వంతెనలకు భవిష్యత్‌లో ఇబ్బందులు తలెత్తకుండా శాశ్వత మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. మోత్కురావుపటే-చందుర్తి రోడ్డుకు అటవీ శాఖ నుంచి అనుమతి వచ్చిందని, రూ.24 కోట్లతో రోడ్డు పనులు పూర్తి చేయనున్నామని వివరించారు. ఎల్లంపల్లి ప్రాజెక్టు పరిధిలో మొత్తం 10 చెరువుల పనులు మొదలుకాగా 7 పూర్తి అయ్యాయన్నారు. తక్కువ



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

బడ్జెట్‌తో ఎక్కువ ఎకరాల భూమి సాగులోకి తీసుకువచ్చేందుకు రూ.325కోట్ల నిధులు మంజూరు అయ్యాయని తెలిపారు. పనులు పూర్తి అయితే 45 వేల ఎకరాల భూములు సాగులోకి వస్తాయన్నారు. జిల్లాలో ఆయా ప్రాజెక్టులు పూర్తిచేస్తే దాదాపు లక్షా యాభై వేల ఎకరాల భూమి సాగులోకి వస్తుందన్నారు. మల్కపేట ప్రాజెక్టు కోసం కుడి, ఎడమ కాలువల నిర్మాణానికి మొత్తం 700 ఎకరాల భూమి అవసరమని జిల్లా నీటి పారుదల శాఖ అధికారి కిషోర్ కుమార్ ప్రభుత్వ విప్ దృష్టికి తీసుకురావడంతో, ప్రతిపాదనలు పంపాలని ప్రభుత్వ విప్ సూచించారు.

ముమ్మరంగా ఇందిరమ్మ ఇళ్ల పనులు..

వేములవాడ నియోజకవర్గ పరిధిలోని ఇందిరమ్మ ఇళ్ల పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయని విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. 1957 ఇళ్ల నిర్మాణాలకు మార్కింగ్ చేశామని, 1482 ఇళ్లు వివిధ దశల్లో ఉన్నాయని, 12 ఇళ్ల నిర్మాణాలు పూర్తి అయ్యాయని గృహనిర్మాణ శాఖ అధికారులు సమావేశంలో విప్ దృష్టికి తీసుకువచ్చారు. మండలాల వారిగా ఇండ్ల నిర్మాణాల పురోగతిపై విప్ ఆరా తీశారు.

రాజన్న ఆదాయం రూ.186 కోట్లు..

వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయానికి ప్రతియేటా రూ.186కోట్ల ఆదాయం వస్తోందని ప్రభుత్వ విప్ అన్నారు. రూ. 150 కోట్లతో ఆలయ విస్తరణ పనులు కొనసాగుతున్నాయన్నారు. భీమేశ్వర ఆలయంలో రూ. 3.50 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామని వెల్లడించారు. రాజన్న ఆలయం వద్ద భక్తులకు అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు.

తాగునీటి సమస్య లేకుండా చూడాలి..

వేములవాడ పట్టణంతో పాటు ఆయా మండాల పరిధిలో మిషన్ భగీరథ వాటర్ సమస్యలు లేకుండా చూడాలని విప్ ఆది శ్రీనివాస్ అధికారులకు సూచించారు. మిషన్ భగీరథలో భాగంగా త్రాగు నీరు సరఫరాకు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని, అగ్రహారంలో వున్న మిషన్ భగీరథ గ్రిడ్ ప్లాంట్ నిర్వహణ పై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. వాస్తవాలను జిల్లా యంత్రాంగానికి సూచించాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆలోచనలకు అనుగుణంగా ప్రభుత్వ శాఖల అధికారులు సమన్వయంతో పని చేస్తూ సమిష్టి విజయం కోసం కృషి చేయాలని కోరారు.

పనులు వేగంగా పూర్తి చేయాలి..

- ఇన్‌చార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్

నియోజకవర్గంలో ఆయా అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. వివిధ అభివృద్ధి పనులకు స్థలాలను వెంటనే గుర్తించాలని సూచించారు. సమన్వయంతో పని చేస్తూ ముందుకు వెళ్లాలని, గడువులోగా పనులు చేయాలని ఆదేశించారు. క్షేత్ర స్థాయిలో పర్యటించి ఆయా సమస్యలు పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో ఆర్డీవో రాధాబాయి, డీఆర్‌డీవో శేషాద్రి, ఆయా శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పల్లె ఓటరు జాబితాకు కసరత్తు

(5వ పేజీ తరువాయి)

400 ఓటర్ల వరకు 468 పోలింగ్ కేంద్రాలు, 650 ఓటర్ల వరకు ఉన్న పంచాయతీల్లో 76 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. పంచాయతీ ఎన్నికల్లో 650 మంది ఓటర్లకు ఒక పోలింగ్ కేంద్రాన్ని సిద్ధం చేస్తున్నారు. అంతకుమించి ఓటర్లు ఉంటే రెండోపోలింగ్ కేంద్రం ఏర్పాటు చేస్తారు. 200 మంది ఓటర్లు ఉన్న చోట ఒక ప్రిసైడింగ్ అధికారి ఒక పోలింగ్ అధికారి ఉంటారు. 201 నుంచి 400 వరకు ఒక ప్రిసైడింగ్ అధికారి ఇద్దరు పోలింగ్ అధికారులు, 401నుంచి 650 వరకు ఉంటే ప్రిసైడింగ్ అధికారితో పాటు ముగ్గురు పోలింగ్ అధికారులను నియమిస్తారు.

కార్యవర్గం

తంగళ్లపల్లి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండల ముదిరాజ్ సంఘం ఎన్నికలు జిల్లా నాయకులు మాజీ జడ్పీటీసీ కోడి అంతయ్య, దేవుని నర్సయ్య అద్వర్యంలో గురువారం నిర్వహించారు. అధ్యక్షుడిగా శ్రీశైలం, ప్రధాన కార్యదర్శిగా బొజ్జ దేవరాజ్, ఉపాధ్యక్షుడిగా మల్లబోయిని ఆనందం, సహాయ కార్యదర్శిగా భీమరి రాములు, కార్యదర్శిగా పోచయ్య, కోశాధికారిగా వెంకటేశం, సలహాదారులుగా పసుపుల తిరుపతి, కాటు మల్లేశం, రెడ్డవేని మల్లేశంలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు కోడి అంతయ్య ప్రకటించారు.

పద్మశాలి జాతీయ సేవాదళం కన్వీనర్‌గా శ్రీకాంత్

సిరిసిల్ల టౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : పద్మశాలి జాతీయ సేవాదళం కన్వీనర్‌గా సిరిసిల్ల పట్టణం బీవైనగర్‌కు చెందిన గూడూరి శ్రీకాంత్‌ను నియిమిస్తూ గురువారం పద్మశాలి జాతీయ సేవాదళం వ్యవస్థాపక అధ్యక్షుడు వేముల మార్కండేయులు ఉత్తర్వులను జారీ చేశారు. శ్రీకాంత్ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాలను గడప గడపకు ప్రచారం చేస్తామన్నారు.

దిగబడిన ధాన్యం లోడు వాహనం

ఎల్లారెడ్డిపేట, నవంబరు20(ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం దుమాల - రాగట్లపల్లి బైపాస్ రోడ్డులో ధాన్యం లోడుతో వెళుతున్న వ్యాను గురువారం దిగబడింది. డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించడం వల్ల ప్రాణాపాయం తృటిలో తప్పినట్లయింది. చుట్టుపక్కల రైతులు, వాహనదారులు దిగబడిన ధాన్యం లోడు వ్యానును జేసీబీ వాహనం సహాయంతో తీయించారు. రహదారి వెంట ధాన్యం కుప్పలు ఉండడం వల్ల వాటిని తప్పించే క్రమంలో వ్యాను అదుపు తప్పి దిగబడిందని పేర్కొన్నారు. కాగా రహదారిపై ఉన్న ధాన్యం కుప్పలను తొలగించి ప్రమాదాలు చోటు చేసుకోకుండా సంబంధిత శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఇల్లంతకుంట, నవంబరు 20(ఆంధ్రజ్యోతి):మండలంలోని రహీంఖాన్‌పేటలోని ఆదర్శ పాఠశాలలో అతిథి అధ్యాపక పోస్టుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ గంగాధర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గంటల ప్రాతిపదికన 9,10,11,12 తరగతులకు ఇంగ్లీష్ బోధించడానికి ఈనెల 25లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈనెల 26న ఇంటర్వ్యూలు నిర్వహించడం జరుగుతుందన్నారు.

నిరుపేద దళితుల అభివృద్ధికి కృషి

ఇల్లంతకుంట, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): నిరుపేద దళితుల అభివృద్ధికి మానకొండూర్ ఎమ్మెల్యే సత్యనారాయణ కృషిచేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా కోకన్వీనర్ సావనపెల్లి రాకేష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలోని కొంతమంది కాంగ్రెస్‌పార్టీ అగ్రవర్ణాలకు చెందిన నాయకులు ప్రభుత్వ సంక్షేమ పథకాలు దళితులు లబ్ధిపొందకుండా చూస్తున్నారని విమర్శించారు. దళితులపై చేస్తున్న కుట్రలు మానకోవాలని పేర్కొన్నారు.

ఆసుపత్రి సామగ్రి తరలించవద్దు

ఇల్లంతకుంట, నవంబరు 20(ఆంధ్రజ్యోతి) మండలంలోని పెద్దలింగాపూర్ గ్రామంలోని ప్రభుత్వ ఆసుపత్రి సామాగ్రిని తరలించాలని చూస్తే గ్రామస్తులం ఊరుకోమని మాజీ సర్పంచ్ గొడిశెల జితేందర్‌గౌడ్ పేర్కొన్నారు. వారం రోజుల క్రితం ఆసుపత్రిలోని సామాగ్రిని గంబీరావుపేట మండలానికి తరలించే ఏర్పాట్లు జరుగుతుండగా గ్రామస్తులు అడ్డుకున్నారు. మరోసారి తరలించే అవకాశం ఉందని తెలుసుకొని గురువారం ఆసుపత్రిలోని సామాగ్రి మీద ప్రభుత్వ ఆసుపత్రి పెద్దలింగాపూర్ అని రాయించారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ ఎద్దు కుమార్‌తో పాటు గ్రామస్తులు ఉన్నారు.

విద్యార్థులు ఉపకార వేతనాలకు దరఖాస్తు చేసుకోవాలి

ఇల్లంతకుంట, నవంబరు 20(ఆంధ్రజ్యోతి) విద్యార్థులు ఉపకార వేతనాల కోసం దరఖాస్తు చేసుకోవాలని మండల విద్యాధికారి చెప్యాల శ్రీనివాస్‌గౌడ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలో 9. 10వ తరగతులు చదువుతున్న విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. అర్హులైన వారికి సంవత్సరానికి రూ 4వేల ఆర్థిక సహాయం అందుతుందన్నారు. వివరాల కోసం పాఠశాలల ప్రధానోపాధ్యాయుల ద్వారా తెలుసుకోవాలన్నారు.

చేతిరాత పోటీల్లో ప్రతిభ

చందుర్తి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లా గ్రంథాలయ సంస్థ సిరిసిల్ల ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి చేతిరాత పోటీలో చందుర్తి మండలం, ఆశిరెడ్డిపల్లి ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచి బహుమతులు అందుకున్నట్లు ప్రధానోపాధ్యాయురాలు ఎస్ రజిత తెలిపారు. పాఠశాల ఆవరణంలో విద్యార్థులను అభినందించారు. ఉపాధ్యాయులు సంపతి రమేష్, తిరుమల, అర్పిత, విద్యార్థులు పాల్గొన్నారు.

సమన్వయంతో మండలాన్ని ప్రథమ స్థానంలో నిలపాలి



మాట్లాడుతున్న మండల ప్రత్యేక అధికారి అఫ్జల్ బేగం

ఎల్లారెడ్డిపేట, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): అధికారులు సమన్వయంతో పని చేసి పల్లెల ప్రగతికి కృషి చేసి మండలాన్ని జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలపాలని మండల ప్రత్యేక అధికారి అఫ్జల్ బేగం అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల పరిషత్తు కార్యాలయంలో ప్రభుత్వ పథకాల అమలుపై వివిధ శాఖల అధికారులతో గురువారం ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారి అఫ్జల్ బేగం మాట్లాడుతూ గ్రామాల్లోని లబ్ధిదారులు వంద శాతం ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకునేలా అధికారులు చర్యలు చేపట్టాలని అన్నారు. శతశాతం పన్నులను వసూలు చేయడంతో పాటు పారిశుద్ధ్య నిర్వహణ, వీధి దీపాలు వెలుగేలా చూడాలని అన్నారు. ప్రతి ఇంటికి మిషన్ భగీరథ నీరు సరఫరా చేసి ప్రజలు వినియోగించుకునే విధంగా అవగాహన కల్పించాలని అన్నారు. మండల ప్రగతిపై ప్రతి వారం సమీక్ష నిర్వహిస్తామని పేర్కొన్నారు. వివిధ శాఖల అధికారులు విధుల్లో నిర్లక్ష్యం వహించకుండా అభివృద్ధికి పాటు పడాలని అధికారి అఫ్జల్ బేగం కోరారు. సమావేశంలో ఎంపీడీవో సత్తయ్య, ఎంపీవో రాజు, పంచాయతీ కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కోటి చీరల తయారీ ఆర్డర్ ఇచ్చామనడం సరికాదు

చేనేత పవర్‌లూం కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పంతం రవి

సిరిసిల్ల టౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : కోటి చీరల ఉత్పత్తికి ఆర్డర్లు ఇచ్చామని ముఖ్యమంత్రి చెప్పడం సరికాదని, టెస్కో ద్వారా 64 లక్షల చీరలకు మాత్రమే ఆర్డర్లు ఇచ్చారని చేనేత పవర్‌లూ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పంతం రవి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని కార్మికుల భవనంలో విలేకరుల సమావేశంలో రవి మాట్లాడారు. సిరిసిల్ల పవర్‌లూం పరిశ్రమంలోని ఒడిదుడుకులను దృష్టిలో పెట్టుకొని పవర్‌లూం పరిశ్రమపై ఆధారపడిన ఆసాములు, పవర్‌లూం కార్మికులకు ఉపాధి కల్పించాలని ఆరు నెలలుగా ఇందిరా స్వశక్తి చీరల ఉత్పతికి ఆర్డర్లు ఇచ్చి ఉపాధి కల్పించిన రాష్ట్ర ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతులు తెలిపారు. విద్యుత్ సమస్యలతో పరిశ్రమ ఎప్పుడు మూత పడుతుందోనని ఆసాములు, కార్మికులు ఆందోళనకు గురి అవుతున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి విద్యుత్ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాయకులు సోమ నాగరాజు, గాజుల లింగం, ఎలగేటి రాజమల్లు, వడ్డెపల్లి లక్ష్మణ్ పాల్గొన్నారు.

ఎస్ఆర్ఆర్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీల ప్రారంభం

వేములవాడ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): వేములవాడ పట్టణంలోని బాలనగర్‌లో గురువారం ఎస్ఆర్ఆర్ క్రికెట్ ప్రీమియర్ లీగ్-5ను ఘనంగా ప్రారంభించారు. డాక్టర్ నర్సింగరావు గ్రౌండ్‌లో జిల్లా క్రికెట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు లింగారెడ్డి ఆధ్వర్యంలో ప్రారంభించారు. కార్యక్రమంలో క్రికెట్ అసోసియేషన్‌ఆర్గనైజర్స్ సతీష్, రాజు, నిఖిల, నవీన్, మ్యాన సంతోష్, శ్రీకాంత్ ఉన్నారు.

కేటీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం



సిరిసిల్లలో కేటీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఆటోయూనియన్ ప్రతినిధులు

సిరిసిల్ల, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ వర్కింగ్ అధ్యక్షుడు మాజీ మంత్రి కే తారకరామారావు రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ఆటో డ్రైవర్లందరికీ తానే ప్రీమియం చెల్లించి రూ 5 లక్షల ప్రమాద బీమాను కల్పిస్తున్నందుకు ఆటో డ్రైవర్లుహర్షం వ్యక్తం చేశారు. గురువారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని చేనేత చౌక్ వద్ద మాజీ మంత్రి కేటీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో ఆటోడ్రైవర్ల అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు బొల్లి రాంమోహన్, ప్రతినిధులు అల్లే శ్రీనివాస్, దోరా సతీష్, సలీం, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

● గంబీరావుపేట : మండల కేంద్రంలో గురువారం ఆటో యూనియన్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో మండల ఆటో యూనియన్ అధ్యక్షుడు ఇబాదుల్లాఖాన్, జిల్లా అధ్యక్షుడు అల్లె శ్రీనివాస్, గౌరవ అధ్యక్షుడు రాంమోహన్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పాపగారి వెంకటస్వామి, పట్టణ అధ్యక్షుడు వెంకటి, సీనియర్ నాయకులు దయాకర్ రావు, లింగమ్‌యాదవ్, చెవుల మల్లేశం, గంద్యాడపు రాజు, మీనయ్య తదితరులు ఉన్నారు.

సనుగులలో వెలగని వీధిదీపాలు



సనుగులలో గ్రామంలోని ఓ విద్యుత్ స్తంభానికి వెలగని వీధి దీపం

చందుర్తి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): చందుర్తి మండలం సనుగుల గ్రామంలో వీధి దీపాలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి సమయంలో ఇళ్లలో నుంచి బయటకు రావాలంటేనే కష్టంగా ఉందని గ్రామ ప్రజలు వాపోతున్నారు. రాత్రి సమయంలో ఇళ్లలో నుంచి బయటకు రావాలంటే తీవ్ర భయాందోళ చెందుతున్నట్లు చెప్పారు. విషపురుగులు ఎక్కువగా గ్రామంలోకి వస్తున్నట్లు చెబుతున్నారు. 2 వారాలుగా వీధిదీపాలు వెలగక రాత్రి వెళలో ఇబ్బందులు పడుతున్నమని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా గ్రామ ప్రత్యేక అధికారి స్పందించి గ్రామంలోని 6,7వార్డులో వీధిదీపాలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

ఎన్‌సీడీసీ గవర్నింగ్ కౌన్సిల్ సమావేశంలో 'కొండూరు'..

గంభీరావుపేట, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : దేశ రాజధాని ఢిల్లీలో జరిగిన జాతీయ సహకార అభివృద్ధి సంస్థ(ఎన్‌సీడీసీ) గవర్నింగ్ కౌన్సిల్ సమావేశంలో నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు పాల్గొన్నారు. కేంద్ర హోంశాఖ, సహకార శాఖ మంత్రి అమిత్‌షా అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది. జమ్ము కాశ్మీర్, లద్ధాక్ ఈశాన్యప్రాంతాల్లో కొత్త కార్యాలయాల ఏర్పాటు, నీలి ఆర్థిక వ్యవస్థ ప్రోత్సాహం,పాడి-మత్స్య, మహిళా సహకార సంఘాల బలోపేతంపై సమావేశంలో చర్చించారు.

రైతులకు అండగా సహకార సంఘాలు

- ఇప్పటివరకు 68 వేల క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు - సింగిల్ విండో చైర్మన్ తిరుపతిరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ ఏనుగు తిరుపతిరెడ్డి



బాధ్యతలు స్వీకరిస్తున్న కొలనూరు సింగిల్‌విండో చైర్మన్ రామ్మోహన్‌రావు

వేములవాడ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు రెతుల పక్షపాతిగా పని చేస్తున్నాయని సింగిల్‌విండో చైర్మన్ ఏనుగు తిరుపతిరెడ్డి అన్నారు. వేములవాడ పట్టణంలోని సింగిల్‌విండో కార్యాలయంలో గురువారం కార్యవర్గ సభ్యులతో పాలకవర్గ సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా తిరుపతిరెడ్డి మాట్లాడుతూ ఖరీఫ్ వర్షాకాలంలకు సంబంధించిన వరి ధాన్యాన్ని రైతులకు ఇబ్బందులు లేకుండా కొనుగోలు చేశామని అన్నారు. 10 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేసి ప్రారంభించామన్నారు. ఇప్పటివరకు 68 వేల 924 క్వింటాళ్ల వరి ధాన్యాన్ని కొనుగోలు చేశామన్నారు. ప్రభుత్వ సహకారంతో రైతులకు ఇబ్బందులు లేకుండా చూస్తున్నామని తెలిపారు. వేములవాడ పరిధిలోని కొనుగోలు కేంద్రంలో 13 వేల 741 క్వింటాళ్ల వరిధాన్యం, శత్రాజుపల్లి గ్రామంలో 1806, వట్టెంలలో 9605, బొల్లారంలో 2142, చెక్కపల్లి 10122, హన్మాజిపేట 3148, లింగంపల్లి 4538, మల్లారం 10474, మర్రిపల్లి 2868, నూకలమర్రి 10476 క్వింటాళ్లు కొనుగోలు చేసినట్లు వివరించారు. రైతులకు ఇబ్బందులు తలేత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తిన తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ సమావేశంలో వైస్ చైర్మన్ తూం లక్ష్మీకాంతరావు సీఈవో మిట్ట లక్ష్మణ్ డైరెక్టర్‌లు తదితరులు ఉన్నారు.

బాధ్యతలు స్వీకరించిన కొలనూరు సింగిల్ విండో పాలకవర్గం

కోనరావుపేట, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): కోనరావుపేట మండలం కొలనూరు సింగిల్ విండో పాలకవర్గం గురువారం బాధ్యతలు స్వీకరించారు. సింగిల్‌విండో చైర్మన్‌గా సంకినేని రామ్మోహన్‌రావుతో పాటు డైరెక్టర్ల పదవీ కాలం ముగియడంతో ప్రత్యేక అధికారిని నియమించారు. కాగా హైకోర్టు ఆదేశాల మేరకు డీసీవో సింగిల్‌విండో పాలకవర్గం పదవీకాలం పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ కాగా, వారు బాధ్యతలు చేపట్టారు. సింగిల్ విండో చైర్మన్ రామ్మోహన్‌రావు, వైస్ చైర్మన్ కాశవేని మహేష్‌తో పాటు డైరెక్టర్లు ఉన్నారు.

జిల్లా స్థాయి ఇన్నోవేషన్ మేళాలో విద్యార్థి ప్రతిభ



ప్రశంసా పత్రం అందుకుంటున్న విద్యార్థి

చందుర్తి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): చందుర్తి మండలం జోగాపూర్ జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో 10 తరగతి చదువుతున్న విద్యార్థి బొల్లం శ్రీవిన్ జిల్లా కేంద్రంలో జరిగిన జిల్లా స్థాయి ఇన్నోవేషన్ మేళాలో ప్రతిభ కనబరిచినట్లు ప్రధానోపాధ్యాయులు శ్రీధర్‌రాజు తెలిపారు. గురువారం జరిగిన మేళాలో ప్రథమ స్థానంలో నిలిచి రూ.3వేల నగదుతోపాటు జ్ఞాపిక, ప్రశంస పత్రం అందుకున్నట్లు తెలిపారు. గైడ్‌టీచర్ మేడికాల అంజయ్య నేతృత్వంలో స్థిరమైన వ్యవసాయంలో యంత్రాన్ని తయారుచేసి ప్రదర్శించినందుకు ఉన్నత పాఠశాలల విభాగంలో(సుస్థిర వ్యవసాయం) అనే ఉప అంశంలో ఈ బహుమతి లభించినట్లు పేర్కొన్నారు. గైడ్ టీచర్ అంజయ్య మాట్లాడుతూ యంత్రం ద్వారా వరి, గోధుమ పంట నుంచి వడ్లు, గోదుమలు సులువుగా వేరుచేయవచ్చని, హార్వెస్టర్ ఖర్చులు ఎక్కువగా ఉన్న ఈ రోజుల్లో ఈ యంత్రం ద్వారా తేలికగా చాలా తక్కువ ఖర్చుతో పంటలను కుప్పనూర్చవచ్చన్నారు. ప్రధానోపాధ్యాయులు శ్రీధర్ రాజు, పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ లావణ్య, ఉపాధ్యాయులు మహేష్, జావిద్, గోవర్ధన్, శ్రీనివాస్, పద్మ, నర్సయ్య విద్యార్థిని, గైడ్‌టీచర్‌ను అభినందించారు.

మాదక ద్రవ్యాల నిర్మూలనపై అవగాహన

ఎల్లారెడ్డిపేట, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మాదక ద్రవ్యాల నిర్మూలనపై అవగాహన పెంచుకోవాలని ఇంపాక్ట్ ఫౌండేషన్ ప్రతినిధి జనార్థన్ అన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లగొల్లపల్లిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నషా ముక్త్ భారత్ అభియాన్, మిషన్ పరివర్తన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్ఎం మురళీధర్, జిల్లా బాలల సంరక్షణ విభాగం ప్రతినిధి దేవిక, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పేదవాడికి అందనంత దూరంలో ఇసుక ధరలు

- బీజేపీ మండల అధ్యక్షుడు సొల్ల క్రాంతికుమార్

ముస్తాబాద్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : పేదవాడికి అందనంత దూరంలో ఇసుక ధరలు అమాంతంగా పెరిగిపోతున్నాయని బీజేపీ మండల అధ్యక్షుడు సొల్ల క్రాంతికుమార్ ఆరోపించారు. శుక్రవారం సొల్ల క్రాంతికుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం ఉచితంగా అందించే ఇసుకను, ముస్తాబాద్ మండలంలో మాత్రం ఇందిరమ్మ ఇళ్ల పేరిట రూ.6వేల వరకు డబ్బులు వసూలు చేస్తున్నారని వాపోయారు. సామాన్యులకు తక్కువ ధరకు ఇసుకను అందించాలని లేకుంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. అలాగే ఇందిరమ్మ ఇళ్లు కాకుండా జనరల్ కేటగిరికి చెందిన గృహ నిర్మాణదారులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారని ఇసుక దొరకక నెలల తరబడి నిర్మాణాలు ఆగిపోయాయని పేర్కొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

బోయినపల్లి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): బోయినపల్లి మండల మోడల్ స్కూల్లో గురువారం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి కార్తీక్ విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. చలికాలంలో వచ్చే సీజనల్ వ్యాధులు, రక్తహీనత, నోటి, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. అలాగే బాలికల వసతి గృహాన్ని సందర్శించి విద్యార్థులకు వేడివేడి ఆహారాన్ని అందించాలని, ఆహార పదార్థాలపై ఈగలు దోమలు వాలకుండా చూసుకోవాలని, వార్డెన్‌కు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ హేమలత, హెల్త్‌అసిస్టెంట్ బిల్లా అశోక్, ప్రిన్సిపాల్ రఘునాథ్, ఏఎన్ఎం తిరుమల, ఆశా కార్యకర్త లత పాల్గొన్నారు.

కేజీబీవీ విద్యార్థులకు వైద్య పరీక్షలు

రుద్రంగి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలోని విద్యార్థులకు మండల వైద్యాధికారులు గురువారం వైద్య పరీక్షలు నిర్వహించారు. విద్యార్థులకు రక్త పరీక్షలతో పాటు వైద్య పరీక్షలు నిర్వహించారు. డాక్టర్లు అభినయ, ప్రభాకర్, కేజీబీవీ ఎస్‌వో వనిత, ఏఎన్ఎం విజయ తదితరులు పాల్గొన్నారు.

● వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట), నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): వీర్నపల్లి మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ఆర్‌బీఎస్‌కే ఆధ్వర్యంలో గురువారం వైద్య పరీక్షలు నిర్వహించారు. 450 మంది విద్యార్థుల రక్త నమూనాలను సేకరించారు. వ్యక్తిగత పరిశుభ్రత, వ్యాధుల పట్ల అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్యులు సంధ్యారాణి, సాయి కిరణ్, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ అనూష, పీడీ ప్రతాప్‌కుమార్, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనం

బోయినపల్లి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని స్తంభంపల్లిలో మండల బీఆర్ఎస్ మీడియా వారియర్స్ ఆత్మీయ సమ్మేళనం గురువారం జరిగింది. బీఆర్ఎస్ నాయకులు డాక్టర్ చిన్నాడి అమిత్ కుమార్, అక్కనపల్లి కరుణాకర్, గురజాల కోటి, కమల్‌గౌడ్, సాగర్ తదితరులు పాల్గొన్నారు.